# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 222 | విశాఖపట్నం | 13-5-2026 బుధవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 222 | VISAKHAPATNAM | 13-5-2026 WEDNESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-



SBI

PATHAKAM NEWS

SCAN & PAY

UPI ID: 44576280686@sbi

BHIM | UPI

yono SBI | BHIM SBI Pay

G Pay | Paytm | PhonePe



Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram




2లో


ప్రారంభమైన 'ఔషధి ఎక్స్‌ప్రెస్'..

దేశంలోనే తొలి ఫార్మసీ రైలు!



5లో

నత్తనడకన రహదారుల పనులు!



6లో

మధ్య వయస్సులో విటమిన్ డి తగ్గితే.. వృద్ధాప్యంలో ఇబ్బందే..



# చాలని బస్సులతో.. ప్రయాణికులకు పాట్లు!

- స్త్రీ శక్తి పథకంతో పెరిగిన ప్రయాణికులు
- అందుబాటులోకి రాని అదనపు బస్సులు

**అనకాపల్లి, పతాకం న్యూస్:** రద్దీ సమయంలో సరిపడ ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్సులో బస్సుల కోసం చాలా సేపు వేచివుండాల్సి వస్తున్నది. బస్సు వచ్చిందే తడవుగా.. ఒక్కసారిగా ఎగబడుతున్నారు. ముఖ్యంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి తొమ్మిది వరకు ఈ సమస్య అధికంగా వుంటున్నది. అనకాపల్లి ఆర్టీసీ డిపోలో మొత్తం 90 బస్సులు వున్నాయి. వీటిలో రెండు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కాగా మిగిలినవన్నీ పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు. అనకాపల్లి జిల్లా ఏర్పడకముందు విశాఖపట్నం ఉమ్మడి జిల్లాగా వున్నప్పుడు ఇతర మండలాల ప్రజలు జిల్లా కేంద్రంలో వివిధ పనుల నిమిత్తం నేరుగా అక్కడకు వెళ్లేవారు. నాలుగేళ్ల క్రితం జిల్లాల పునర్విభజన జరిగి, అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడిన తరువాత వారంతా ఇప్పుడు అనకాపల్లి వస్తున్నారు. దీంతో మండలాల నుంచి రాకపోకలు బాగా పెరిగాయి. అవకాశం వున్న మేరకు ఎక్కువ మంది ఆర్టీసీ బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో బస్సులు కిటకిటలాడుతుంటాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గత ఏడాది ఆగస్టు నుంచి స్త్రీ శక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో రద్దీ విపరీతంగా పెరిగింది. కానీ గత ఏడాది కాలంలో అనకాపల్లి డిపోకు కొత్త బస్సులు వచ్చిన దాఖలాలులేవు. అనకాపల్లి నుంచి విశాఖ నగరం, ఎలమంచిలి మినహా మిగిలిన విజయనగరం, సబ్బవరం, పాయకరావుపేట, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, దేవరాపల్లి, రాంబిల్లి తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు సరిపడ బస్సులు నడవడంలేదు. దీంతో ఆయా బస్సులన్నీ వంద శాతానికి మించి ఓఆర్‌తో నడుస్తున్నాయి. ప్రయాణికులు ఎక్కువగా రాకపోకలు సాగించే ఉదయం, సాయంత్రం వేళల్లో సరిపడ బస్సులు లేకపోవడంతో ఆర్టీసీ కాంప్లెక్సుల్లో చాలా సేపు వేచివుండాల్సి వస్తున్నది. ప్లాట్‌ఫారంపైకి బస్సు రాకముందే (తరువాయి 2వ పేజీలో)

## కొత్త వాహనం రిజిస్ట్రేషన్ 24 గంటల్లో పూర్తి కావాలి: రాంప్రసాద్ రెడ్డి



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖలో పెను మార్పులు తీసుకువస్తూ కూటమి ప్రభుత్వం వాహనదారులకు భారీ ఊరటనిచ్చే వార్తను అందించింది. ఇకపై కొత్త వాహనం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలను అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కొత్త విధానంలో అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే, డీలర్ టెంపరరీ రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత సంబంధిత అధికారి 24 గంటల్లోపు దానిపై స్పందించకపోతే, ఆ రిజిస్ట్రేషన్ ఆటోమేటిక్‌గా ఆమోదం పొందినట్లుగా పరిగణించబడుతుంది. ఇది దేశంలోనే ఒక విప్లవాత్మక నిర్ణయం అని చెప్పవచ్చు. దీనివల్ల వాహనదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన (తరువాయి 2వ పేజీలో)

## గడ్కరీతో చంద్రబాబు, లోకేష్ భేటీ



**గౌహతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ గౌహతిలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అసోం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనేందుకు వెళ్లిన వీరు, గౌహతి విమానాశ్రయంలో గడ్కరీని కలిశారు. ఈ సమావేశం అనంతరం మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా వేదికగా (తరువాయి 2వ పేజీలో)

## రైతులకు అన్యాయం జరిగితే సహించబోం: అచ్చెన్నాయుడు



**అమరావతి, పతాకం న్యూస్:** రొయ్యల ఫీడ్ ధరలను కొన్ని ఫీడ్ కంపెనీలు పెంచడంపై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు (తరువాయి 2వ పేజీలో)

## త్వరలోనే జీఏడీకి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలు: నారాయణ



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం నిర్మిస్తున్న ఆధునిక నివాస సముదాయాల పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం రాజధాని అభివృద్ధిని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో క్వార్టర్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. తాజాగా రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ నిర్మాణ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలు త్వరలోనే జీఏడీకి అప్పగిస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు. అధికారుల భవనాలు, మంత్రుల బంగ్లాల నిర్మాణాలు తుది దశలో ఉన్నాయని మంత్రి తెలిపారు. రాజధాని అమరావతిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లను పరిశీలించిన మంత్రి నారాయణ, పనులు చివరి దశకు చేరుకున్నాయని, ఇంటిరియర్ పనులతోపాటు మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలకు ఆదేశించారు. అంతేకాకుండా గ్రూప్-1, గ్రూప్-2 టవర్ల నిర్మాణ పనులు ముగింపు దశలోకి వచ్చాయన్నారు. అమరావతిలో జరుగుతున్న పనులపై పక్క రాష్ట్రాల్లో (తరువాయి 2వ పేజీలో)




ఖరీఫ్ వేళ... నకిలీ విత్తనాల గోల..!

5లో




త్వరలో ఎస్ఐఆర్ మూడో దశ ప్రారంభం : ఈసీ

5లో


పతాకం న్యూస్ APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## భారం..

యుద్ధం బూచి ఏ వర్గం ప్రజల నెత్తిన ఎప్పుడు పడుతుందో ఊహించడం కష్టం. వంటింటి గ్యాస్ మొదలుకొని కాకా హోటళ్లల్లో తినుబండారాల వరకు ఏదీ 'యుద్ధం' ప్రభావానికి అతీతం కాదు. తాజాగా రైతులు సాగుకు ఉపయోగించే కాంప్లెక్స్ ఎరువుల ధరలను ఉత్పత్తి కంపెనీలు 'యుద్ధం' సాకుతో ఎకాయికిన బస్తాపై రూ.300 వరకు పెంచాయి. ఈ పరిణామం ఇప్పటికే ప్రభుత్వ విధానాలతో ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన అన్నదాతలకు మోయలేని భారం. కాగా ధరల పెరుగుదల ఇక్కడితో ఆగదని ఎరువుల కంపెనీలు సంకేతాలివ్వడంతో రైతుల్లో ఆందోళన ఇంకా అధికమైంది. కంపెనీలు ఈ విధంగా ధరలు పెంచడానికి కేంద్ర ప్రభుత్వమే కారణం. యూరియాపైన మాత్రమే కేంద్రం కంట్రోల్ ఉంది. దానిపైనే పూర్తి రాయితీని భరిస్తోంది. తతిమ్మా రసాయన ఎరువులకు పోషకాధారిత సబ్సిడీ (ఎన్‌బిఎస్) అమలు చేస్తోంది. ఎన్‌బిఎస్ అంటే ఉత్పత్తి ధరలో కొన్ని ధాతువులకు కొంత పరిమాణానికి మాత్రమే రాయితీ ఇస్తుంది. ఏ సంవత్సరం ఎంత దేనికి ఎంత సబ్సిడీ ఇవ్వనుందో ప్రకటిస్తుంది. ఉత్పత్తి ఖర్చులు పెరిగినప్పుడు ఆ మేరకు కేంద్రం రాయితీ భరిస్తే రైతులకు ధరలు పెరగవు. మోడీ ప్రభుత్వం అందుకు సిద్ధపడట్లేదు. బిజెపి ప్రభుత్వం ఎరువుల సబ్సిడీలకు ఏటికేడు కోతలు పెడుతోంది. 2024-25 బడ్జెట్‌లో వాస్తవ ఖర్చు రూ.1.81 లక్షల కోట్లు కాగా 2025-26లో 1.56 లక్షల కోట్లు ప్రతిపాదించి 1.86 లక్షల కోట్లకు సవరించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 1.70 లక్షల కోట్లకు ప్రతిపాదనలు తగ్గించింది. సవరించిన బడ్జెట్‌లో 16 వేల కోట్లు కత్తిరించింది. కుదించిన నిధుల్లో యూరియాకు 10 వేల కోట్లు, ఎన్‌బిఎస్‌కు 6 వేల కోట్లు తగ్గాయి. గత రెండేళ్లల్లో బడ్జెట్‌ను సవరించడానికి ప్రధాన కారణం అంతర్జాతీయంగా ముడి సరుకుల ధరల పెరుగుదల ఒకటైతే, అంతకంటే ముఖ్యమైనది డాలర్‌తో మన రూపాయి విలువ పతనం. క్రమేపి రూపాయి విలువ పడిపోతుండటంతో దిగుమతులకు ఎక్కువ చెల్లించాల్సి వస్తోంది. ఆర్థిక వృద్ధి గురించి మాట్లాడే మోడీ రూపాయి విలువ పతనాన్ని అడ్డుకోలేకపోతున్నారు. మోడీ ప్రభుత్వ విధానాలే అందుకు కారణం. డిఎపి వంటివి, ఎరువుల తయారీకి ఉపయోగించే కొన్ని ధాతువుల్లో ఎక్కువ భాగం మనం దిగుమతులపైనే ఆధారపడ్డాం. దిగుమతులను వీలైన మేరకు తగ్గించుకోవాలని కేంద్రం చూస్తోంది. ఆ లక్ష్యంతోనే ఎరువుల పాలసీ, బడ్జెట్ రూపొందుతోంది. ఇదే సమయంలో ప్రభుత్వ, సహకార రంగంలోని ఎరువుల కర్మాగారాలను సామర్థ్యానికి అనుగుణంగా నడిపించడం, మూసివేసిన వాటిని తెరిపించడం చేయడం లేదు. సబ్సిడీలను తగ్గించుకునేందుకు కేంద్రం పిఎం-ప్రణామ్ అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. ఏడాదికి కనీసం పది శాతం రసాయన ఎరువులను తగ్గించాలని టార్గెట్ విధించింది. ఎరువుల వాడకాన్ని తగ్గించిన రాష్ట్రాలకు ప్రత్యేక నిధులను ప్రోత్సాహకంగా ఇస్తామంది. ఖర్చు లేని ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ సాగు, కంపోష్టు, ఆర్గానిక్ ఎరువులను ప్రోత్సహించాలని చెబుతోంది. నానో యూరియా, నానో డిఎపిలను బలవంతంగా రైతులకు అంటగట్టాలని రాష్ట్రాలకు హుకుం జారీ చేసింది. రాష్ట్రాల అవసరాలకు తగ్గట్టు కాకుండా సరఫరాలో తరచు కోతలు పెడుతోంది. ఎక్కువ ఎరువులు అమ్మిన డీలర్లు, కొన్న రైతులపై నిఘా పెట్టింది. ఈ చర్యలు అదనుకు రైతులకు ఎరువులు దొరక్కుండా చేస్తున్నాయి. ఎరువుల కోసం అనివార్యంగా బ్లాక్ మార్కెట్‌ను ఆశ్రయించి అధిక మొత్తంలో జేబు నుంచి పెట్టుకోవాల్సిన దైన్యం అన్నదాతలది. ఇప్పటికే రైతులకు గిట్టుబాటు ధరల్లేక, అన్ని ఉత్పాదకాల రేట్లూ పెరిగి పెట్టుబడులు పెట్టలేక ఆత్మహత్యల బాట పడుతుండగా, ఎరువుల ధరల పెంపు మరింత భారమవుతుంది. ధరల అదనపు భారం రాష్ట్ర రైతాంగంపై రూ.800 కోట్లుగా ఉంది. ఇక్కడి టిడిపి కూటమి ప్రభుత్వం మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి చేసి ఎరువుల ధరలు పెరక్కుండా చూడాలి. కేంద్రం ఎరువుల కంపెనీలను ధరలు పెంచనీకుండా చర్యలు తీసుకోవాలి. సడ్సిడీని భరించి రైతులను ఆదుకోవాలి.

## ప్రారంభమైన 'ఔషధి ఎక్స్‌ప్రెస్'..
## దేశంలోనే తొలి ఫార్మసీ రైలు!



**హైదరాబాద్, పతాకం న్యూస్:** భారతీయ రైల్వే మరో చారిత్రాత్మక ముందడుగు వేసింది. హైదరాబాద్ నుంచి ఔషధాలను సురక్షితంగా ఎగుమతి చేసేందుకు 'ఔషధి ఎక్స్‌ప్రెస్' పేరుతో దేశంలోనే మొట్టమొదటి ఫార్మసీ రైలును అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్రత్యేక రైలు ఈ నెల 2వ తేదీన హైదరాబాద్ నుంచి ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్టుకు తన తొలి యాత్రను విజయవంతంగా పూర్తి చేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఔషధాలను వాటి నాణ్యత ఏమాత్రం దెబ్బతినకుండా నిర్ణీత ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేయడం అత్యంత కీలకం. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని, ఈ రైలులో అత్యాధునిక కోల్డ్ స్టోరేజీ కంటైనర్లను ఏర్పాటు చేశారు. దీనివల్ల హైదరాబాద్‌లోని వందలాది ఫార్మా కంపెనీలు తమ ఉత్పత్తులను సురక్షితంగా, వేగంగా ముంబై పోర్టుకు చేరవేసి, అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి చేయడం సులభతరం అవుతుంది. గతంలో రోడ్డు మార్గంలో రవాణాకు ఎక్కువ సమయం పట్టడంతో పాటు ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గుల వల్ల మందులు పాడయ్యే ప్రమాదం ఉండేది. ఔషధి ఎక్స్‌ప్రెస్ ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపనుంది. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పీఎం గతిశక్తి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ ఆవిష్కరణకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. "ఇది కేవలం ఒక రైలు మాత్రమే కాదు, తెలంగాణ ఫార్మా రంగానికి ఒక లైఫ్ లైన్ వంటిది. దీనివల్ల సరైన సమయంలో, సరైన నాణ్యతతో మందులు గమ్యస్థానాలకు చేరతాయి" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో భవిష్యత్తులో దేశంలోని ఇతర ఫార్మా కేంద్రాలకు కూడా ఇలాంటి రైళ్లను విస్తరించే యోచనలో ఉన్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు.

## రాయలసీమను చంద్రబాబు సస్యశ్యామలం చేశారు: ఫరూక్



**పశ్చిమగోదావరి, పతాకం న్యూస్:** రాయలసీమను సీఎం చంద్రబాబు సస్యశ్యామలం చేశారని ఏపీ మైనార్టీ శాఖ మంత్రి మహ్మద్ ఫరూక్ వ్యాఖ్యానించారు. రాయలసీమకు చంద్రబాబు వల్లే సాగునీరు వస్తోందని పేర్కొన్నారు. మంగళవారం పశ్చిమగోదావరి జిల్లాలో మంత్రి ఫరూక్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాయలసీమ ప్రాంతంలోని కొండల చుట్టూ ఉన్న చెరువులన్నీ నింపి తెలుగు గంగ ద్వారా రైతులకు తమ ప్రభుత్వం సాగునీరు అందిస్తోందని తెలిపారు. గతంలో అనంతపురం జిల్లా దేశంలో వెనుకబడిన జిల్లాల్లో రెండోదిగా ఉండేదని మంత్రి చెప్పుకొచ్చారు. నేడు కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా అంతా సస్యశ్యామలమై జీడీపీలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని వెల్లడించారు. ముస్లింల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఏపీలో షాదీఖానాల ఏర్పాటుకు అంకురార్పణ చేసింది దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని ప్రస్తావించారు. నేడు హజ్‌యాత్రకు రూ.లక్ష కేటాయించి ముస్లింలను సీఎం చంద్రబాబు గౌరవిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఎన్నికల్లో తమను గెలిపించినందుకు ప్రజల రుణం తీర్చుకోలేమని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

## యువ లాయర్ల పట్ల సహనంతో ఉండండి.. జడ్జిలకు సుప్రీంకోర్టు హితవు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** న్యాయమూర్తులు ముఖ్యంగా యువ న్యాయవాదుల పట్ల సహనం, దయాభావంతో వ్యవహరించాలని, వారిని ప్రోత్సహించాలని సుప్రీంకోర్టు హితవు పలికింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఇటీవల ఓ యువ న్యాయవాదిని ఉద్దేశించి జడ్జి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, బార్ అసోసియేషన్ జోక్యంతో వివాదం సామరస్యంగా పరిష్కారమైనందున ఈ కేసును తాము మూసివేస్తున్నట్లు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. మే 4న ఏపీ హైకోర్టులో జస్టిస్ రాజశేఖర్‌రావు, ఓ యువ న్యాయవాది కోపంతో ఫైళ్లను పోడియంపై కొట్టారని భావించి, అతడిని పోలీసు కస్టడీకి పంపిస్తానని హెచ్చరించారు. అయితే, ఆ న్యాయవాది చేతిలోంచి ఫైలు జారిపోయిందని తెలిపారు. ఈ ఘటనపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తీర్మానాలు చేయడంతో సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. హైకోర్టు న్యాయమూర్తి కేవలం మౌఖికంగా వ్యాఖ్యానించారని, ఎటువంటి లిఖితపూర్వక ఆదేశాలు ఇవ్వలేదని ధర్మాసనం గుర్తుచేసింది.

(మొదటిపేజీ తరువాయి)

## ప్రయాణికుల పాట్లు!

ప్రయాణికులు ఎక్కడానికి ఎగబడుతున్నారు. ఈ క్రమంలో వృద్ధులు, పిల్లలు, గర్భిణులు, చిన్నపిల్లల తల్లులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో చోడవరం బస్టాప్, నెహ్రూచౌక్ బస్టాపుల్లో పలువురు ప్రయాణికులు బస్సులు ఎక్కేవారు. కానీ స్త్రీశక్తి పథకం అమల్లోకి వచ్చిన తరువాత బస్సులన్నీ కాంప్లెక్సులోనే నిండిపోతున్నాయి. దీంతో చోడవరం, నెహ్రూచౌక్ బస్టాపుల్లో ఎక్కేవారంతా ఇప్పుడు కాంప్లెక్సుకు వచ్చేస్తున్నారు. స్త్రీ శక్తి పథకం రాకముందు పలువురు మహిళలు ఆటోలు, టాటా ఏస్, మ్యాక్సీ క్యాబ్ వంటి వాటిలో ప్రయాణించేవారు. ఉచిత పథకం అమల్లోకి వచ్చిన తరువాత 90 శాతం మందికిపైగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

## ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం.. వెల్ఫేర్ బోర్డుకు కొత్త సభ్యుల నియామకం



**హైదరాబాద్, పతాకం న్యూస్:** ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ స్టేట్ వెల్ఫేర్ బోర్డుకు కొత్త సభ్యులను నియమిస్తూ చంద్రబాబు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ట్రాన్స్‌జెండర్ హక్కుల పరిరక్షణ చట్టం-2019 ప్రకారం ఈ నియామకాలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పించేలా కలెక్టర్లను ప్రభుత్వం నామినేట్ చేసింది. విశాఖపట్నం కలెక్టర్‌ను ఆంధ్ర ప్రాంతానికి ప్రతినిధిగా నియమించగా, తిరుపతి కలెక్టర్‌ను రాయలసీమ ప్రాంతానికి ప్రతినిధిగా నియమించింది. ఈ నిర్ణయం ద్వారా ప్రాంతీయ స్థాయిలో ట్రాన్స్‌జెండర్ సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ స్టేట్ వెల్ఫేర్ బోర్డులో నామినేట్ సభ్యులుగా ముగ్గురు ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులకు అవకాశం కల్పించింది. కోట ప్రేమ్ సాగర్ రాయ్, నక్క జీవన్ కుమారి, బోను దుర్గలను బోర్డు సభ్యులుగా నియమించింది. ఈ నియామకాల ద్వారా ట్రాన్స్‌జెండర్లకు సంబంధించిన సమస్యలు నేరుగా ప్రభుత్వ దృష్టికి వెళ్లే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం, నియమిత సభ్యుల పదవీకాలం రెండేళ్ల పాటు ఉంటుంది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ నియామకాలు అమల్లో ఉంటాయని ఏపీ సర్కార్ స్పష్టం చేసింది. మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జీఓ ఎంఎస్ నంబర్14 విడుదల చేసింది. ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక భద్రత వంటి అంశాల్లో మరింత సహకారం అందించేందుకు చర్యలు చేపడుతోంది. ట్రాన్స్‌జెండర్ హక్కుల పరిరక్షణ చట్టం-2019 అమల్లో భాగంగా సంక్షేమ బోర్డు కీలక పాత్ర పోషించనుంది.

(మొదటిపేజీ తరువాయి)

## గడ్కరీతో చంద్రబాబు, లోకేష్ భేటీ

తన స్పందనను పంచుకున్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా' అని అభివర్ణించిన లోకేష్, ఆయనను కలవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. జాతి నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనలో గడ్కరీ చూపిస్తున్న ఉత్సాహం తమందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశాన్ని వేగంగా, బలంగా నిర్మించాలన్న ఆయన తపన అమోఘమని కొనియాడారు. ఈ సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను గడ్కరీ ప్రశంసించారని లోకేష్ వెల్లడించారు. ఏపీలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు నిర్మించేందుకు తాము చేస్తున్న కృషికి ఆయన ప్రోత్సాహం ఎంతో విలువైనదని లోకేష్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ భేటీలో చంద్రబాబు, గడ్కరీ పలు అంశాలపై చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ఈ భేటీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా పాల్గొన్నారు.

## పూర్తి కావాలి: రాంప్రసాద్ రెడ్డి

అవసరం ఉండదు. సెలవు దినాల్లో కూడా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లన్నింటినీ త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, కేవలం ఫ్యాన్సీ నంబర్లను కోరుకునే వాహనదారులకు మాత్రమే ఈ 24 గంటల నిబంధన నుంచి మినహాయింపు ఉంటుంది, ఎందుకంటే ఆ ప్రక్రియ వేలం ద్వారా జరుగుతుంది. సామాన్య వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, అవినీతికి తావులేకుండా సేవలు అందించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం.

## త్వరలోనే జీఏడీకి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలు: నారాయణ

మాట్లాడుకుంటున్నారన్నారు. 34525 ఎకరాలకు ప్లాట్స్ రైతులకు ఇచ్చామని తెలిపారు. కేవలం ఇక 674 మందికి మాత్రమే న్యాయపర చిక్కులు వల్ల రైతులకు ప్లాట్స్ ఇవ్వాల్సి ఉందని మంత్రి నారాయణ అన్నారు. కావాలని కొందరు అమరావతిపై రాజకీయ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. భూములు మాత్రమే ఇచ్చాం, ప్రభుత్వం ప్లాట్స్ ఇవ్వలేదు అని ప్రచారం చేసే వాళ్లు నిజాలు తెలుసుకోవాలని మంత్రి హితవుపలికారు. "అధికారులు, మంత్రుల కోసం చేపట్టిన క్వార్టర్స్ నిర్మాణ పనులను జీఏడీకి అప్పగిస్తాం. బంగ్లాల నిర్మాణాలు తుది దశలో ఉన్నాయి. సంబంధిత కాంట్రాక్టు సంస్థలు మిగిలిన ఇంటీరియర్ పనులను వేగంగా పూర్తి చేయాలి. గ్రూప్-1, గ్రూప్-2 టవర్ల నిర్మాణ పనులు ముగింపు దశలోకి వచ్చాయి. పక్క రాష్ట్రాల వారు కూడా అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనులపై మాట్లాడుకుంటున్నారు. కొందరు కావాలనే అమరావతిపై రాజకీయ కుట్ర చేస్తున్నారు." నారాయణ తెలిపారు. అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం మొత్తం 12 టవర్లలో 288 ఆధునిక ఫ్లాట్లు నిర్మిస్తున్నారు. వీటిని అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నారు. క్లబ్ హౌస్, ఆసుపత్రి, స్విమ్మింగ్ పూల్, భద్రతా వ్యవస్థలు, సౌరశక్తి వినియోగం, వర్షపు నీటి సంరక్షణ, మురుగునీటి శుద్ధి వంటి సదుపాయాలు కల్పించనున్నారు. రాజధాని అమరావతిలో నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం దాదాపు రూ.524.70 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. పెండింగ్‌లో ఉన్న అంతర్గత విద్యుత్ పనులు, లిఫ్టులు, ఫైర్ ఫైటింగ్ సిస్టమ్‌లు, ప్లంబింగ్, ల్యాండ్‌స్కేపింగ్ తదితర పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయన్నారు.

## రైతులకు అన్యాయం జరిగితే సహించబోం: అచ్చెన్నాయుడు

ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులతో చర్చించకుండా ధరలు పెంచడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. వనామీ ఫీడ్‌పై రూ.8, టైగర్ ఫీడ్‌పై రూ.10లు కొన్ని ఫీడ్ కంపెనీలు పెంచాయని పేర్కొన్నారు. మంగళవారం అమరావతి వేదికగా మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. APSADA చట్టాన్ని పాటించాలని ఫీడ్ కంపెనీలను మంత్రి హెచ్చరించారు. పెంచిన ధరల అమలు నిలిపివేయాలని నోటీసులు జారీ చేశారు. ఫీడ్ ధరల పెంపు విషయంపై APSADA చట్టప్రకారం కమిటీలో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రైతులకు అన్యాయం జరిగితే సహించబోమని మందలించారు. ఆక్వా రైతుల పక్షాన ప్రభుత్వం ఎల్లప్పుడూ నిలుస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా కల్పించారు.

# ఢిల్లీ, నిజాముద్దీన్, ఫరీదాబాద్‌లకు ప్రత్యేక రైళ్లు..



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** వేసవిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ-ఢిల్లీ, విశాఖ-నిజాముద్దీన్, విశాఖ-ఫరీదాబాద్ మధ్య ఒక ట్రిప్పు (రానుపోను) ప్రత్యేక రైళ్లు ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. విశాఖ-ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ (08511) ఈనెల 22న ఉదయం 4.15 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటిరోజు రాత్రి 11.00 గంటలకు ఢిల్లీ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఢిల్లీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (08512) ఈనెల 25న ఉదయం వేకువజామున 2.00 గంటలకు ఢిల్లీలో బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 5.00 గంటలకు విశాఖ చేరుతుంది. విశాఖ-న్యూఢిల్లీ ఎక్స్‌ప్రెస్ (08517) ఈనెల 22న ఉదయం 3.30 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటిరోజు రాత్రి 10.30 గంటలకు న్యూఢిల్లీ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో న్యూఢిల్లీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (08518) ఈనెల 25న వేకువజామున 1.45 గంటలకు న్యూ ఢిల్లీలో బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 4.00 గంటలకు విశాఖ చేరుతుంది. విశాఖ-నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ (08513) ఈనెల 21న సాయంత్రం 5.40 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11.40 గంటలకు నిజాముద్దీన్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో నిజాముద్దీన్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (08514) ఈనెల 24న రాత్రి 11.55 గంటలకు నిజాముద్దీన్‌లో బయలుదేరి మరుసటిరోజు రాత్రి 10.40 గంటలకు విశాఖ చేరుతుంది. విశాఖ-ఫరీదాబాద్ ఎక్స్‌ప్రెస్ (08515) ఈనెల 21న ఉదయం 4.15 గంటలకు విశాఖలో బయలుదేరి 23న ఉదయం 8.00 గంటలకు ఫరిదాబాద్ చేరుతుంది. తిరుగు ప్రయాణయంలో ఫరీదాబాద్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (08516) ఈనెల 24న అర్ధరాత్రి 12.10 (తెల్లవారితే 25వ తేదీ) ఫరీదాబాద్‌లో బయలుదేరి 26వ తేదీ అర్ధరాత్రి 12.45 గంటలకు (తెల్లవారితే 27వ తేదీ) విశాఖ చేరుతుంది.

## పోర్టులో కీలక ప్రాజెక్టులకు శ్రీకారం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం పోర్టులో పలు కీలక ప్రాజెక్టులకు పోర్టు చైర్మన్ అంగముత్తు శంకుస్థాపన చేశారు. అన్ని గేట్ల వద్ద అండర్ వెహికల్ స్కానింగ్ పరికరాలు, కార్గో గేట్ల వద్ద రేడియోలాజికల్ డిటెక్షన్ పరికరాలు, కాన్వెంట్ జంక్షన్ నుంచి హెచ్-7 జంక్షన్ వరకు బీటీ రహదారి నిర్మాణం, ఓర్ హ్యాండ్లింగ్ కాంప్లెక్స్‌లో రహదారుల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే పూర్తయిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇందులో పోర్టులో 38 కి.మీ. రైల్వే ట్రాక్ విద్యుద్దీకరణ, పరిపాలనా భవనంలో డిస్‌ప్లే కారిడార్, ఎస్‌టీపీ వద్ద 170 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటు, ప్రస్తుతం ఉన్న ఎంసీహెచ్‌వీ రైల్వే ట్రాక్ అప్‌గ్రేడేషన్, కస్టమ్స్ ప్రహరీ వంటివి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో పోర్టు సెక్రటరీ శంకర్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణం వేగవంతం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** భోగాపురం విమానాశ్రయాన్ని అనుసంధానిస్తూ చేపట్టిన మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణం అనుకున్న సమయంలోగా పూర్తిచేయడానికి పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ సూచించారు. కమిషనర్ తేజ్‌భరత్, సీఈ వినయకుమార్‌లతో కలిసి ఆయన నేరెళ్లవలస-తాళ్లవలస రహదారి పనులను పరిశీలించారు. పనులు వేగంగా చేసే క్రమంలో నాణ్యతకు తిలోదకాలు ఇస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. రాజీ లేకుండా పూర్తి నాణ్యతతో పనులు పూర్తి చేయాలన్నారు. తొలుత ఏడు మాస్టర్‌ప్లాన్ రహదారులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకోవగా ఇప్పటివరకు మూడు రోడ్లు పూర్తయ్యాయని, మిగిలిన రహదారులు జూన్‌లో పూర్తిచేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ మధుసూదనరావు, ఈఈ దుర్గాప్రసాద్, డీఈ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేశ్ పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి



**పాడేరు, పతాకం న్యూస్:** రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం పాడేరులో పర్యటించనున్న నేపథ్యంలో పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ ఆదేశించారు. మంత్రి లోకేశ్ పర్యటనపై కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా మంత్రి లోకేశ్ పర్యటనలో ప్రొటోకాల్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే హెలీప్యాడ్ వద్ద చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేయాలని, వాహనాల పార్కింగ్‌ను పక్కాగా చూడాలన్నారు. అందుకు పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనులు చేయాలని సూచించారు. మంత్రి కాన్వాయ్ పార్కింగ్, ఇతర వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. కాన్వాయ్‌లో వాహనాన్నీ ఫిట్‌నెస్‌గా ఉండేలా చూడాలని, ఫైరింజన్, అంబులెన్సులు సైతం పక్కా కండీషన్‌లో ఉండాలన్నారు. హెలీప్యాడ్ నుంచి లగిశపల్లి, కాడెలి, నక్కలపుట్టు మీదుగా ఎస్‌పీ కార్యాలయం సమీపంలోని తుమ్మరమెట్ట వద్దకు మంత్రి లోకేశ్ చేరుకుంటారన్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్లను పరిశుభ్రం చేయాలని, మంత్రి కార్యక్రమానికి తరలివచ్చే జనానికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. మంత్రి పర్యటన ఏర్పాట్లను అప్పగించిన ఆయా శాఖల అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేయాలని జేసీ సూచించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఏఎస్‌పీ నవజ్యోతిమిశ్రా, జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ‘సేవే ఊపిరిగా... ‘మన నర్సులు - మన భవిష్యత్’ అంటూ మోగిన నినాదాలు”

- ఆర్టస్ నర్సింగ్ కాలేజీలో వారంపాటు అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవ వేడుకలు
- ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను స్మరించుకున్న విద్యార్థులు





**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నర్సు అంటే కేవలం ఇంజెక్షన్ ఇచ్చే వ్యక్తి కాదు... రోగికి ధైర్యం చెప్పే తల్లి, అర్ధరాత్రి నిద్రలేచి పరిగెత్తే దేవత. ఆ సేవా స్ఫూర్తిని మరోసారి గుర్తు చేస్తూ ఆర్టస్ నర్సింగ్ కాలేజీలో ఈరోజు అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు కాలేజీ ఆవరణలో నర్సింగ్ విద్యార్థులు, సిబ్బంది కలిసి వివిధ కార్యక్రమాలు చేపట్టారు. “మన నర్సులు - మన భవిష్యత్” అనే నినాదంతో ప్లకార్డులు పట్టుకుని నాయుడు తోట, వేపగుంట ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. నర్సింగ్ విద్య ప్రాధాన్యత, ఆరోగ్య సంరక్షణలో నర్సుల పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించారు. కాలేజీ కరస్పాండెంట్ తాకసి స్వాతి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ప్రిన్సిపాల్ గ్రేసీ నందు, ఫ్యాకల్టీ సభ్యులు హరాదిని, హన్నా, రేవతి, పూర్ణ, అదితి, శ్రావణి, హైమావతి, సిమ్రాన్ తదితరులు పాల్గొన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ “దీపం పట్టుకుని చీకట్లో సైతం సేవ చేసిన” త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కొవ్వొత్తుల ప్రదర్శన, సేవా గీతాలు, స్కిట్‌లతో పోటీ పరీక్షలతో క్యాంపస్ మొత్తం సేవా స్ఫూర్తితో నిండిపోయింది. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. “కరోనా సమయంలో రేయింబవళ్లు నిద్రహారాలు మాని ప్రాణాలు కాపాడినది నర్సులే. ఈ రోజు మేము నేర్చుకుంటున్నాం, రేపు మీ ప్రాణాలు కాపాడేది మేమే” అని ఓ విద్యార్థిని కళ్లలో నీళ్లు తిరిగేలా చెప్పిన మాటలు అక్కడున్న వారిని కదిలించాయి. వారం రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమాలు నర్సింగ్ వృత్తి పట్ల గౌరవాన్ని పెంచడమే కాక, భవిష్యత్ నర్సులకు స్ఫూర్తినిచ్చాయి. “సేవకు మించిన మతం లేదు” అని చాటిన ఆర్టస్ నర్సింగ్ కాలేజీ విద్యార్థులు, ఫ్లోరెన్స్ నైటింగేల్ బాటలో నడిచేందుకు సిద్ధమయ్యారు.

## ముఖ హాజరుకు ఉపాధి కూలీల పాట్లు



**పెదబయలు, పతాకం న్యూస్:** ఉపాధి హామీ పనులకు ముఖ హాజరు తప్పనిసరి చేయడంతో శ్రామికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోజుకు రెండు సార్లు సెల్ సిగ్నల్ అందే ప్రాంతానికి వెళ్లవలసి వస్తోందని వారు వాపోతున్నారు. ఈ సమస్యపై మండలంలోని గోమంగి పంచాయతీలో గల ఉపాధి శ్రామికులు సోమవారం నిరసన చేపట్టారు. తమ హాజరును వేసుకోవాలంటే రోజుకు రెండుసార్లు సెల్ సిగ్నల్ గల ప్రాంతానికి వెళ్లవలసి వస్తోందని, సెల్ సిగ్నల్ కోసం కొండలు, గుట్టలు ఎక్కి గంటల తరబడి నిరీక్షించినా ముఖ హాజరు పడడం లేదని పంచాయతీ పరిధిలోని బోయరాజులు, రాయిమామిడి గ్రామాల్లోని ఉపాధి శ్రామికులు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనుల్లో తీసుకొచ్చిన ముఖ హాజరు విధానం వలన ఇబ్బందులు ఎదురవుతుండడంతో గిరిజన యువత పొరుగు రాష్ట్రాలకు కూలి పనులకు వెళ్లిపోతున్నారని చెప్పారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

## పాడేరులో తొలగని గ్యాస్ కష్టాలు!




**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లా కేంద్రం పాడేరులో వంట గ్యాస్ ఇక్కట్లు తొలగక వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. వారం క్రితం వరకు చమురు, గ్యాస్ కొరత సమస్యలుండేవి. ప్రస్తుతం డీజిల్, పెట్రోల్‌కు పెద్దగా సమస్య లేకపోగా గ్యాస్‌కు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. వాణిజ్య గ్యాస్ సరఫరా పూర్తిగా నిలిచిపోగా వంట గ్యాస్ సైతం గడువు నాటికి అందడం లేదని వినియోగదారులు అంటున్నారు. వాస్తవానికి గతంలో 21 రోజులు గడువు ఉండే గ్యాస్ బుకింగ్‌ను కొరత నేపథ్యంలో 45 రోజులకు గడువు పెంచిన సంగతి తెలిసిందే. అయితే వాస్తవానికి గ్యాస్ బుకింగ్ చేసుకున్న వారికి 45 రోజుల గడువు ముగిసిన తర్వాత సైతం ఓటీపీలు రావడం లేదు. ఒక్కో మారు 50 రోజులు లేదా 60 రోజులు సమయం పడుతుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఈ పరిస్థితి జిల్లా కేంద్రం పాడేరులో మాత్రమే నెలకొనగా.. జిల్లాలో ఇతర ప్రాంతాల్లో వంట గ్యాస్‌కు పెద్దగా ఇబ్బందులు తలెత్తకపోవడం గమనార్హం. జిల్లా కేంద్రం పాడేరులో ప్రతి ఏడాది మే నెలలో జరిగే మోదకొండమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతి ఏడాది స్థానిక వినియోగదారులకు అదనపు బండను ఇచ్చేవారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో బుకింగ్ చేసుకున్నవే సమయానికి అందక పోవడంతో ఉత్సవాల అదనపు బండ ఇస్తారా? లేదా? అనే దానిపై స్పష్టత లేకుండా పోయింది. అలాగే అధికారులు సైతం దీనిపై ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో వినియోగదారుల్లో అయోమయం నెలకొంది. జిల్లాలో ఎక్కడా లేని గ్యాస్ కొరత పాడేరులోనే నెలకొనడంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 17 గ్యాస్ ఏజెన్సీలుండగా.. వాటిలో 1,10,516 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో జిల్లా కేంద్రం పాడేరు మొత్తం 22,015 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ గ్యాస్ కనెక్షన్లకు ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ సిలిండర్లు సరఫరా అవుతున్నాయి. జిల్లా కేంద్రంలో ఒకటే గ్యాస్ ఏజెన్సీ ఉండడంతో గ్యాస్ సరఫరాగా సమస్యగా మారిందని వినియోగదారులు అంటున్నారు. ఆయా కనెక్షన్లకు తగ్గట్టుగా ఆయిల్ కంపెనీ నుంచి గ్యాస్ బండలు సరఫరా కావడం లేదని అంటున్నారు. దీంతో స్థానిక వినియోగదారులకు సకాలంలో గ్యాస్ అందని పరిస్థితులు కొనసాగుతున్నాయని పలువురు అంటున్నారు. ఉన్నతాధికారులు దీనిపై సమగ్ర విచారణ చేపట్టి వినియోగదారుల గ్యాస్ కష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

## అందుబాటులోకి శారదా వనం..




**కశింకోట, పతాకం న్యూస్:** మండలంలోని బయ్యవరంలో జాతీయ రహదారిని ఆనుకొని అటవీ శాఖ ఏర్పాటు చేసిన ‘శారదా వనం’ సందర్శకులకు అందుబాటులోకి వచ్చింది. అడవిని తలపించేలా పచ్చని చెట్లు, పక్కనే కొండలు, వనంలో ఏర్పాటు చేసిన పలు రకాల జంతువుల ఆకృతులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వేసవిలో కుటుంబంతో సహాల ఇక్కడకు వస్తే.. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదకరంగా గడిపేలా తీర్చిదిద్దారు. ఇక్కడ అటవీ శాఖకు మొత్తం 600 ఎకరాలకుపై కొండలు, అడవులు వుండగా, ఇందుకు 25 ఎకరాల్లో శారదా వననాన్ని అభివృద్ధి చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.1.4 కోట్లు మంజూరు చేసింది. పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. సుమారు రూ.8 లక్షలు వెచ్చించి ప్రవేశ ద్వారాన్ని నిర్మించారు. పెన్సిళ్ల ఆకారంలో చెక్కలను చెక్కి చుట్టూ శారదావనం చుట్టూ ప్రహరీ గోడ మాదిరిగా అందంగా తీర్చి దిద్దారు. వనం లోపల నిజమైన ఏనుగును తలపించేలా భారీ ఏనుగుబొమ్మను, రెండు అడవి దున్నల బొమ్మలను ఏర్పాటు చేశారు. సందర్శకులు వీటి వద్ద నిలబడి సరదాగా ఫొటోలు దిగుతున్నారు. పార్కు మధ్యలో డెక్‌ను ఏర్పాటు చేశారు. పర్యాటకులు దీనిపైకి ఎక్కి చుట్టూ పచ్చగా వున్న ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు. పార్కులో ఆర్‌వో వాటర్ ప్లాంటు, క్యాంటిన్, ఇంటర్‌ప్రిటేషన్ కేంద్రం, ఐదు పగోడాలు నిర్మించారు. అయితే వాటర్ ప్లాంటు, క్యాంటీన్ ఇంకా అందుబాటులోకి రాలేదు. శారదా వనంలోకి ప్రవేశ రుసుము రూ.20గా నిర్ధారించారు. అయితే పర్యాటకులను మరింతగా ఆకట్టుకోవాలంటే ఇంకా సదుపాయాలు కల్పించాల్సిన అవసరం వుందని సందర్శకులు అభిప్రాయపడుతున్నారు.

## పెదపాడు గ్రామానికి మహర్దశ



**డుంబ్రిగుడ, పతాకం న్యూస్:** ఎన్నో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని మండలంలోని పోతంగి పంచాయతీలో గల పెదపాడు గ్రామానికి కూటమి ప్రభుత్వం వచ్చాక మహర్దశ పట్టింది. గ్రామంలో పాఠశాల భవనంతో పాటు అన్ని వీధుల్లో రోడ్లు నిర్మించడంతో ఆ గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెదపాడు గ్రామాన్ని గత ఏడాది డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సందర్శించారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసు కున్నారు. రహదారి సౌకర్యం లేక గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నట్టు తెలుసుకుని అరకు- పాడేరు ప్రధాన రహదారి నుంచి గ్రామానికి సుమారు మూడు కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పాఠశాల భవనం నిర్మించాలని సూచించారు. దీంతో అధికారులు ప్రధాన రహదారితో పాటు గ్రామంలో మిగతా రోడ్లను కూడా నిర్మించారు. కొత్తగా పాఠశాల భవనాన్ని నిర్మించారు. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## రహదారి కుంగిపోతోందని కలెక్టర్‌కు వినతి



**నెల్లిమర్ల, పతాకం న్యూస్:** నగర పంచాయతీ పరిధిలోని సారిపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో రహదా రి కుంగిపోతోందని, వెంటనే బాగుచేయాలని ఆ గ్రామ స్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. నగర పంచాయతీ పరిధిలోని తొంపలపేట జంక్షన్ నుంచి కుమిలి కాలువ గట్టుపై వెళ్లే తారురోడ్డు ఇప్పటికే పలుచోట్ల కుంగిపో యిందని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. గట్టిగా వర్షా లు కురిస్తే రోడ్డు కాలువలలోకి కొట్టుకుపోయే ప్రమాద ముందన్నారు. అలా జరిగితే బృందావన్ వ్యాలీకాలనీ, జగ్గరాజుపేట, నీలంరాజుపేట, కుదిపి, సారిపల్లి గ్రా మాలకు రాకపోకలు నిలిచిపోతాయని చెప్పారు. అలాగే జంక్షన్ నుంచి బృందావన్ కాలనీ వరకు వీధిలైట్లు లేకపోవడంతో చీకటి పడ్డాక రాకపోకలకు ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో రాత్రివేళల్లో గం జాయి, మద్యం సేవిస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి శిథిల రహదారిని బాగుచేయాలని, వీధిలైట్లు వేయాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో జేజే పాథక్ తదితరులు ఉన్నారు.

## చిన్నారులను పీడిస్తున్న జ్వరాలు..



**సీతంపేట, పతాకం న్యూస్:** సీతంపేట ఏజెన్సీని మలేరియా వణికిస్తోంది. ఇటీవల కాలంలో అధికంగా పాజిటివ్ కేసులు నమోదవుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. సీతంపేట ఏరియా ఆసుపత్రిలో 360 వరకు ఓపీ నమోదైంది. వీరిలో అధికశాతం మంది జ్వర బాధితులే ఉన్నారు. సీతంపేట ఏరియా ఆసుపత్రిని ఆశ్రయించిన రోగుల్లో ఎక్కువ మంది చిన్నారులు కూడా ఉన్నారు. కాగా పలువురు రోగులకు మలేరియా(ర్యాపిడ్ డయాగ్నొస్టిక్) నిర్ధారణ పరీక్షలు చేయగా.. 11 కేసులు పాజిటివ్‌గా నమోదయ్యాయి. ఈ నెల ప్రారంభం నుంచి చూస్తే ఏరియా ఆసుపత్రిలో ఆర్‌డీటి కిట్‌ల ద్వారా నిర్వహించిన పరీక్షల్లో 60వరకు మలేరియా పాజిటివ్ కేసులు నమోదైనట్లు నివేదికలు చెబుతున్నాయి. కాగా మలేరియా పాజిటివ్ కేసుల్లో ఎక్కువ మంది చిన్నారులు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. వాతావరణంలో మార్పుల కారణంగా జ్వరాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు. చలి జ్వరం, ఒళ్లునొప్పులు, తలనొప్పి వంటి లక్షణాలతో గిరిజన చిన్నారులు ఎక్కువ మంది సీతంపేట ఏరియా ఆసుపత్రిని ఆశ్రయించారు. గిరిశిఖర గ్రామం వంబరెల్లికి చెందిన చిన్నారి సవర సుచిత్ర, అంటికొండకి చెందిన సవర జాన్, జొనగ గ్రామానికి చెందిన సవర హరిణి, హారికలతో పాటు లంబగూడకి చెందిన సవర జాన్, సవర అక్షతో పాటు వారి తల్లి సవర సులోమి కూడ జ్వరంతో బాధపడుతోంది. వీరి ముగ్గరిలో సవర సులోమి, జాన్‌లు మలేరియాతో ఇబ్బంది పడుతున్నారు.

## వరి కొనుగోళ్లపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం



**హైదరాబాద్, పతాకం న్యూస్:** రబీ వరి కొనుగోళ్లపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. మధ్యంతర గోదాములకు క్వింటాల్‌కు రూ.17 హ్యాండ్లింగ్ ఛార్జీలు, వరి అన్‌లోడింగ్ హమాలీ ఛార్జీలు రూ.6.50 నుంచి రూ.8.50కి పెంచింది. కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములు, మిల్లులకు వేగంగా ధాన్యం తరలింపునకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా వరి కొనుగోళ్లకు అంతరాయం లేకుండా కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది. రబీ 2025-26 సీజన్‌కు ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి రానున్నాయి. మంగళవారం జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, వాకిటి శ్రీహరి, సీఎస్ రామకృష్ణరావు హాజరయ్యారు. అన్ని జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద ఎదురవుతున్న సమస్యలు, జిల్లాల్లో ఉన్న పరిస్థితులు, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలపై జిల్లా కలెక్టర్ల నుంచి సీఎం ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్లకు ముఖ్యమంత్రి కొన్ని ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం సేకరణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకూడదన్నారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చూడాలని సూచించారు. లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## 103 మంది పోలీస్ సిబ్బందికి బదిలీలు

**కాకినాడ, పతాకం న్యూస్:** జిల్లా పోలీసు కార్యాలయంలో 103 మంది పోలీసు సిబ్బందికి బదిలీల ప్రక్రియను మంగళవారం జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ చేపట్టారు. వారిలో 9 మంది ఏఎస్సైలు, 10 మంది హెడ్ కానిస్టేబుళ్ళు, 84 మంది కానిస్టేబుళ్లు కౌన్సిలింగ్ ద్వారా బదిలీ అయ్యారు. వీరంతా ఒకే పోలీస్ స్టేషన్ లో 5 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకుని ఉన్నారు. బదిలీల ప్రక్రియలో వీలైనంత వరకు అందరికీ కోరుకున్న చోట పోస్టింగ్ కల్పించినందుకు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# వైద్యులు సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు



**టెక్కలి, పతాకం న్యూస్:** 'వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వీడుతారా.. చర్యలు తీసుకోమంటారా?' అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. టెక్కలిలో జిల్లా కేంద్రాసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 9గంటలకు రావాల్సిన వైద్యులు, వైద్య సిబ్బంది.. దాదాపు గంట ఆలస్యంగా విధులకు హాజరుకావడంపై అసహనం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వీడాలని, సమయపాలన పాటించాలని.. లేదంటే చర్యలు తప్పవని వైద్యులు, సిబ్బందిని మంత్రి అచ్చెన్న హెచ్చరించారు. చిన్నపాటి జ్వరంతో వచ్చిన రోగులను కూడా రిఫర్ చేస్తున్నట్టు ఫిర్యాదులొస్తున్నాయని, ఈ విధానాన్ని మార్చుకుని పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందజేయాలని స్పష్టం చేశారు.

జిల్లా కేంద్రాసుపత్రిలో నీటి కొరత విషయమై మంత్రి అచ్చెన్న ఆరా తీశారు. ఆస్పత్రికి అవసరమైన నీరు ఎందుకు తగ్గిందని సంబంధిత ప్లంబర్ లంబ నారాయణ, డయాలసిస్ విభాగం ప్రతినిధి సీతారామ్‌ను ప్రశ్నించారు. నీటి ఎద్దడి సమస్య అధికారులకు కానీ, తమ దృష్టికి కానీ ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. ఇష్టమైతే బాధ్యతగా పనిచేయండి.. లేదంటే వెళ్లిపోండని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో నీటి కొరత అంశంపై సూపరింటెండెంట్ డాక్టర్ బి.సూర్యారావు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రాసుపత్రి అభివృద్ధికి నేను కృషి చేస్తుంటే మీరు బదలాం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీనిపై కలెక్టర్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడి.. 36గంటల్లో త్రీమెన్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే ఆస్పత్రిలో కిటికీల అద్దాలు వేయాలని, మరుగుదొడ్లు, తలుపులు బాగు చేయాలని, ట్యాప్‌లు, ఫ్యాన్లు మరమ్మతులు చేయాలని సిబ్బందికి సూచించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మంజూరు చేసిన 20 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో బెడ్స్, ఆపరేషన్ టేబుల్స్, పల్స్ ఆక్టోమీటర్స్ వంటి సామగ్రిని మంత్రి ప్రారంభించారు. వీటిని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.

## కొత్తవలసకు పరిష్కారం కాని చెత్త తరలింపు సమస్య



**కొత్తవలస, పతాకం న్యూస్:** కొత్తవలస మేజర్ పంచాయతీకి సంబంధించిన చెత్త తరలింపు సమస్య పరిష్కారం కావడం లేదు. ప్రస్తుతం ఉన్న రాజన్న కాలనీకి చెందిన డంపింగ్‌యార్డులో చెత్తను కాలనీవాసులు వేయనీయకపోవడంతో పంచాయతీకి సేకరించిన చెత్తను ఎక్కడ వేయాలో తెలియక తాత్కాలికంగా కొత్తవలస-విజయనగరం రోడ్డులోని కొత్తవలస జంక్షన్ సమీపంలో ఉన్న శ్మశానవాటిలో చెత్తను వేస్తున్నారు. ఇక్కడ తాత్కలికంగానే చెత్త వేస్తున్నామని, ఇక్కడ నుంచి విశాఖ జిల్లా మధురవాడ ప్రాంతంలోనున్న మారికవలస ఎస్‌డబ్ల్యూపీసీకి తరలిస్తామని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. కొత్తవలస ప్రాంతంలో అనేక ప్రభుత్వ భూములు ఉన్నా.. చాలా భూములు ఆక్రమణదారుల చేతుల్లోను, మరికొన్ని భూములు నివాస ప్రాంతాలకు సమీపంలో ఉండడం వల్ల ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో రెవెన్యూ శాఖ సరైన స్థలాన్ని కేటయించలేకపోతోంది. కొత్తవలస 202 కాలనీ సమీపంలో డంపింగ్‌యార్డుకు స్థలం కేటాయించినా ఆ స్థలంలోకి చెత్త వాహనాలను తీసుకెళ్లడానికి సరైన రహదారి లేకపోవడంతో అక్కడకు తీసుకెళ్లి ఇబ్బందులు పడడం కంటే కొత్తవలస శ్మశానవాటిలో వేయడమే మేలని వేస్తున్నారు. రెవెన్యూ శాఖ పంచాయతీ పరిధిలోని చీపురువలస గ్రామ రెవెన్యూలో మరో ప్రాంతాన్ని గుర్తించిందని, ఆ ప్రాంతం అనువుగా ఉంటే రెండు మూడు రోజులలో అక్కడకు తరలించే అవకాశాలు ఉన్నాయి.

## వీఆర్‌ఎస్ పనులకు మోక్షం



**మక్కువ, పతాకం న్యూస్:** వెంగళరాయసాగర్ ప్రాజెక్టు పరిధిలోని కాలువల్లో పూడిక తీతలు, ఇతర మరమ్మతు పనుల నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రూ. కోటీ 34 లక్షల మేర నిధులు మంజూరు చేసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే మక్కువ, సీతానగరం, బొబ్బిలి మండలాల్లో సుమారు 24,700ఎకరాలకు ఖరీఫ్‌లో పూర్తిస్థాయిలో సాగునీరందే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా ప్రాజెక్టు పరిధిలో మొత్తం 25 పనులు చేపట్టేందుకుగాను అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ పనులన్నీ ఆయకట్టు సంఘాల ఆధ్వర్యంలోనే జరగనున్నాయి. మంజూరైన నిధులతో కాలువల్లో పూడిక తీతలతో పాటు సువర్ణముఖి, గోముఖి రిజర్వాయర్ల పరిధిలో పలు పనులు, షట్టర్ల మరమ్మతులు, డిస్ట్రిబ్యూటరీలను అభివృద్ధి చేయనున్నారు. ఈ సందర్భంగా వీఆర్‌ఎస్ ప్రాజెక్టు డీఈ డి.సురేష్ మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని కాలువల్లో పూడికతీత, ఇతర మరమ్మతు పనులకు నిధులు మంజూరయ్యాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగానే కాలువ పనులు పూర్తిచేసి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఓఎన్‌డీ ఎం కింద మంజూరైన పనులన్నీ ఆయకట్టు సంఘాల ఆధ్వర్యంలో జరగనున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టు గట్టుపైన పేరుకుపోయిన డొంకలు, తుప్పలు తొలగిస్తున్నాం. జూలై నెలాఖరు నాటికి పనులన్నీ పూర్తిచేస్తాం. సాగునీటి సరఫరాలో అడ్డంకులు లేకుండా చూస్తాం.' అని తెలిపారు.

## 48 గంటల్లో అల్పపీడనం బలపడే అవకాశం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఉత్తర శ్రీలంక, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాగల 48 గంటల్లో మరింత బలపడే అవకాశముందని విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రం అధికారి జగన్నాథ్ కుమార్ తెలిపారు. అల్పపీడనానికి అనుబంధంగా 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, ఈ కారణంగా కోస్తా జిల్లాల్లో 40 నుంచి 50 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయన్నారు. దీని ప్రభావంతో మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గత 24 గంటల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో 32.4 మి.మీ. వర్షపాతం నమోదైందన్నారు.

## ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందించండి




**విజయనగరం, పతాకం న్యూస్:** ఫిర్యాదుదారులను సత్వర న్యాయం అందించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన పాల్గొని, స్వయంగా వినతులు స్వీకరించారు. చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 33 ఫిర్యాదులను స్వీకరించారు. భూతగాదాలకు సంబంధించినవి 7, కుటుంబ కలహాలు 6, చీటింగ్ 1, ఇతర అంశాలకు సంబంధించినవి 19 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. ఆ కార్యక్రమంలో ఏఎస్పీ పి.సౌమ్యలత, డీసీఆర్‌బీ సీఐ కె.కుమారస్వామి, ఎస్బీ సీఐ ఏవీ లీలారావు, ఎస్‌ఐలు రాజేష్, ప్రభావతి పాల్గొన్నారు

## ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి





**విజయనగరం, పతాకం న్యూస్:** తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని డీఈవో మాణిక్యంనాయుడు కోరారు. మలిచర్ల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని కొత్తకాపువానిపేటలో నిర్వహించిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశా లలకు ధీటుగా అత్యున్నత ఫలితాలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపా?ధ్యాయులు సుజాత, కామేశ్వరరావు, వీఎస్ఎన్ మూర్తి, పాల్తేరు శ్రీనివాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మా హక్కులను వదులుకోబోం : కార్మికుల నిరసన




**తాడేపల్లిగూడెం, పతాకం న్యూస్:** మా హక్కులను వదులుకోబోం -- లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ .... మంగళవారం తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ వద్ద సత్తి కోదండరామిరెడ్డి అధ్యక్షతన కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఉపాధ్యక్షులు సత్తి కోదండరామిరెడ్డి, చిర్ల పుల్లారెడ్డి, కర్రీ సాయి రెడ్డి మాట్లాడుతూ .... బ్రిటిష్ కాలం నుండి కార్మికులు అనేక పోరాటాలు త్యాగాలు ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఈ 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లు గా విభజించిందని వారు తెలిపారు. ఏప్రిల్ ఒకటో తారీకు నుండి రాష్ట్రాలలో వీటిని అమలు చేయాలని వచ్చినప్పటికీ, మే 4 తారీఖున ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత వెంటనే రాష్ట్రాలు ఈ నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసిందని వారు తెలిపారు. కార్మికుల సాధించుకున్న హక్కులను కార్మికులు వదులుకోరని ప్రభుత్వ విధానాలకి వ్యతిరేకంగా పోరాడుతారని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కార్మికుల ఓట్లతో గెలిచిన ప్రభుత్వం కార్మికుల నెత్తిమీద పిడుగుపాటు వేయడం, సంపన్నులకు వరాలుగా దోచిపెట్టడం చాలా హేయమైన చర్యగా వారు దుయ్యబట్టారు. వెంటనే రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను యధాతధంగా అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## పెట్రోల్, డీజిల్‌పై రూ.5 వరకు పెంపు?



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు మండిపోతున్న నేపథ్యంలో దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. లీటర్‌కు రూ. 4 నుంచి 5 వరకు, వంట గ్యాస్ సిలిండర్‌పై రూ. 40 నుంచి 50 వరకు పెంచాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలు భావిస్తున్నాయి. ఈ నెల 15వ తేదీలోపే ఈ పెంపుపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 105 డాలర్లు దాటింది. ఇరాన్‌తో ఇజ్రాయెల్ యుద్ధం, కీలకమైన హర్మూజ్ జలసంధి మీదుగా చమురు రవాణాకు ఆటంకాలు ఏర్పడటమే ఇందుకు ప్రధాన కారణం. భారత్ తన చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతులపైనే ఆధారపడటంతో ఈ ప్రభావం తీవ్రంగా ఉంది. దీనివల్ల ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ప్రస్తుతం నెలకు సుమారు రూ. 30,000 కోట్ల నష్టాలను ఎదుర్కొంటున్నాయి. చమురు ధరల పెరుగుదల భారాన్ని ప్రజలపై వేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నప్పటికీ, ఒకేసారి కాకుండా దశలవారీగా పెంపును అమలు చేయాలని యోచిస్తోంది. ఒకేసారి పెద్దమొత్తంలో ధరలు పెంచితే ద్రవ్యోల్బణం అదుపు తప్పిపోతుందన్న ఆందోళన ప్రభుత్వంలో ఉంది. అందువల్ల, మొదటి దశలో రూ. 4-5 పెంచి, ఆ తర్వాత నష్టాలు భర్తీ అయ్యేవరకు రూ. 2-4 చొప్పున పెంచుకుంటూ వెళ్లే అవకాశం ఉంది. ఈ ధరల పెంపుతో రవాణా ఛార్జీలు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలపై ప్రభావం పడుతుంది. ఇది మొత్తం ఆర్థిక వ్యవస్థపై భారం మోపుతుంది. పెరుగుతున్న చమురు ధరలకు తోడు, డాలర్‌తో రూపాయి విలువ పడిపోవడం దేశంపై రెట్టింపు భారాన్ని మోపుతోంది.

## త్వరలో ఎస్ఐఆర్ మూడో దశ ప్రారంభం : ఈసీ




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** త్వరలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) మూడో దశ ప్రారంభం కానుందని ఎన్నికల సంఘం(ఈసీ) పేర్కొంది. ఈ ప్రక్రియ ద్వారా దేశంలో 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టనున్నట్లు ఈసీ అధికారులు సోమవారం పేర్కొన్నారు. గత నెలలో కేరళ, అసోం, పుదుచ్చేరి, తమిళనాడు, బంగాల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఈసీ ఈ ప్రక్రియను వాయిదా వేసింది. అయితే, ఎన్నికల ప్రక్రియ పూర్తైన నేపథ్యంలో మూడో దశకు సిద్ధమౌతోంది. ఇప్పటివరకు 10 రాష్ట్రాలు మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో (ఉత్తర్‌ప్రదేశ్, బంగాల్, తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కేరళ, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవా, బిహార్‌లో సర్‌ను చేపట్టారు. అసోం) ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తైంది. మొత్తంగా 99 కోట్ల మంది ఓటర్లలో 60 కోట్ల ఓటర్లు ఈ జాబితా సవరణ ప్రక్రియ పరిధిలోకి వచ్చారు. మిగిలిన 40 కోట్ల ఓటర్లకు సంబంధించి 17 రాష్ట్రాలు, ఐదు కేంద్రపాలిత ప్రాంతాల్లో త్వరలో చేపట్టనున్న మూడోదశ ప్రక్రియలో చేర్చనున్నారు.

## మత సామరస్యాన్ని పాటించాలి: ఎస్పీ దామోదర్



**విజయనగరం, పతాకం న్యూస్:** హనుమాన్ జయంతి, దళిత క్రైస్తవ మహాసభలు సందర్భంగా జిల్లా ప్రజలందరూ పరస్పర గౌరవంతో వ్యవహరించా లని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సమాజంలో శాంతి, మత సామరస్యాన్ని కాపాడు కోవడం ప్రతి పౌరుడి బాధ్యతని అన్నారు. మతపరమైన ద్వేషాన్ని ప్రోత్సహించే విధంగా, అశాంతిని రేకెత్తించే విధంగా పోస్టులు పెట్టడం చట్ట ప్రకారం నేరమని తెలిపారు. గ్రూప్ అడ్మిన్లు తమ గ్రూపుల్లో షేర్‌చేసే ప్రతి మెసేజ్‌ను నిశితంగా పరిశీలించి.. ఏవైనా ద్వేషపూరిత, అభ్యంతరకమైన, రెచ్చగొట్టే విధంగా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే ఆ సందేశాలను తొలగించి, సంబంధిత వ్యక్తులను గ్రూప్ నుంచి తొలగించాలని సూచించారు. ఇటీవల కడప జిల్లాలో జరిగిన ఘటన నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వినియోగంపై జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, ధర్నాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతు లు తప్పకుండా తీసుకోవాలన్నారు. నేరచరిత్ర ఉన్నవారిపై నిఘా పెట్టామని, అల్లర్లు, గొడవలు జరిగితే కమిటీ సభ్యులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

## ఏఐ రాకతో టెక్ రంగంలో ఉద్యోగాల ఊచకోత.. 5 నెలల్లో 92,000 మంది తొలగింపు

**ముంబై, పతాకం న్యూస్:** 2026 సంవత్సరం ప్రపంచ టెక్నాలజీ రంగానికి ఒక గట్టి హెచ్చరికలా మారింది. ఈ ఏడాది కేవలం ఐదు నెలలు గడిచేసరికే, వివిధ టెక్ కంపెనీల్లో ఏకంగా 92,000 మందికి పైగా ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోయారు. గత రెండేళ్లలో చూస్తే, ఏప్రిల్ నెల అత్యంత దారుణంగా నిలిచింది. ఈ ఒక్క నెలలోనే 45,000 మంది ఉద్యోగులపై వేటు పడింది. కరోనా మహమ్మారి సమయంలో భారీగా నియామకాలు చేపట్టిన కంపెనీలు, ఇప్పుడు ఖర్చుల నియంత్రణ, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సామర్థ్యం పెరగడం వంటి కారణాలతో ఉద్యోగులను తొలగిస్తున్నాయి. మెటా, స్నాప్, మైక్రోసాఫ్ట్, ఒరాకిల్, బ్లాక్, అమెజాన్ వంటి దిగ్గజ సంస్థలు ఈ ఏడాది ఉద్యోగాల కోతను ప్రకటించాయి. ఈ పరిణామాలు టెక్ ఉద్యోగులలో తీవ్ర భయాందోళనలను సృష్టిస్తున్నాయి. ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా, ఈ లేఆఫ్స్‌లో అతిపెద్ద అడుగు వేసింది. ఏప్రిల్ 22న దాదాపు 8,000 మంది ఉద్యోగులను, అంటే తమ మొత్తం సిబ్బందిలో 10 శాతం మందిని మే 20 నాటికి వైదొలగాలని ఆదేశించింది. మరో 6,000 ఖాళీలను భర్తీ చేయకుండా నిలిపివేసింది.

# నత్తనడకన రహదారుల పనులు!

## పనుల్లో నాణ్యతా లోపాలు.. బిల్లుల చెల్లింపుల్లోనూ జాప్యం



**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న రహదారుల పనులు నత్తనడకన సాగుతున్నాయి. గడువు పెంచినా జోరందుకోవడం లేదు.. చాలాచోట్ల నిర్మాణాల్లో నాణ్యత లోపాలు దర్శనమిస్తున్నాయి. దీంతో పనుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు మార్చి 10లోపు పూర్తయిన సీసీ రహదారుల నిర్మాణాలకు సంబంధించి ఇప్పటికీ బిల్లుల చెల్లింపులు జరగలేదు. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 1937 సీసీ , 406 బీటీ రహదారులు మంజూరయ్యాయి. రూ. 132 కోట్ల ఉపాధి నిధులతో సీసీ, రూ. 157 కోట్లతో బీటీ రోడ్ల పనులకు అంచనాలు తయారు చేశారు. మార్చి 31లోగా పూర్తిస్థాయిలో పనులు నిర్వహించాలని మండల స్థాయి అధికారులకు ఆదేశాలందాయి. అయితే అనుకున్న మేరకు పనులు పూర్తికాకపోవడంతో ఏప్రిల్ 10వ తేదీకి గడువు పొడిగించారు. అయినప్పటికీ పనుల్లో పురోగతి లేకపోవడంతో ఏప్రిల్ నెలాఖరు వరకు సమయం ఇచ్చారు. కాగా ఇప్పటివరకు 32 బీటీ రోడ్లు పనులు పూర్తయ్యాయి. 303 రహదా రులు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రారంభం కాని రహదారులు 70 వరకూ ఉన్నాయి. ఇక 740 వరకు సీసీ రహదారులు పూర్తయ్యాయి. 267 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 909 రహదారులు ప్రారంభం కాలేదు.

పాలకొండ డివిజన్‌లో 965 సీసీ రోడ్ల పనులకు గాను 178 పూర్తయి, 114 రహదారులు పలు దశల్లో ఉన్నాయి. 655 పనులు ప్రారంభం కావల్సి ఉంది. పార్వతీపురం డివిజన్‌లో 972 పనులకు గాను 562 సీసీ రహదారుల పనులు పూర్తయ్యాయి. మరో 153 పలు దశల్లో ఉండగా, 254 పనులు ప్రారంభం కావాల్సి ఉంది. పార్వతీపురం పీఆర్ఐ విభాగానికి సంబంధించి ఏప్రిల్ నెలాఖరుకు బలిజిపేట, పార్వతీపురం, సీతానగరం మండలాల్లో 546 సీసీ రహదారులకు గాను 324 పూర్తయ్యాయి. మరో 105 పలు దశల్లో ఉండగా, ప్రారంభం కాని రహదారులు 114 వరకు ఉన్నాయి. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు 174 రోడ్లు మంజూరు కాగా 118 పూర్తయ్యాయి. 56 రహదారులు ప్రారంభించాల్సి ఉంది. గరుగుబిల్లి, కొమరాడ మండలాలకు 252 మంజూరు కాగా, 120 పూర్తయ్యాయి. మరో 48 రోడ్లు పలు దశల్లో ఉన్నాయి. 84 రహదారి పనులు ప్రారంభం కావాల్సి ఉంది. కురుపాం-2కు సంబంధించి గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కురుపాం మండలాలకు 671 పనులు మంజూరు కాగా, 101 పూర్తయ్యాయి. మరో 62 పనులు వివిధ దశల్లో ఉండగా, 508 పనులు ప్రారంభం కావాల్సి ఉంది. పాలకొండ, భామిని, సీతంపేట, వీరఘట్టాం మండలాలకు 294 పనులు మంజూరు కాగా, 77 పూర్తయ్యాయి. మరో 52 పలు దశల్లో ఉండగా, 147 ప్రారంభం కావాల్సి ఉంది. ప్రస్తుతం నిర్మాణం పూర్తయిన సీసీ రహదారులకు సంబంధించి క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు.

**బీటీ రోడ్ల పనులు ఇలా..**

బలిజిపేట, పార్వతీపురం, సీతానగరం మండలాల్లో 73 బీటీ రహదారులకు గాను 19 పూర్తయ్యాయి. మరో 46 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఏడు బీటీ రహదారుల పనులు ప్రారంభం కావాల్సి ఉంది. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో 8 రహదారులకు గాను రెండు పూర్తయ్యాయి. మరో నాలుగు రహదారులు పలు దశల్లో ఉండగా, రెండు రహదారుల పనులు ప్రారంభం కావల్సి ఉంది. కురుపాం సెక్షన్-1లోని గరుగుబిల్లి, కొమరాడ మండలాల్లో 139 పనులకు గాను మూడు పూర్తికాగా, మరో 101 రహదారులు పలు దశల్లో ఉన్నాయి. 35 రహదారి పనులు ప్రారంభం కావాల్సి ఉంది. సెక్షన్-2 పరిధిలో గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కురుపాం మండలాల్లో 166 బీటీ రహదారులకు గాను నాలుగు పూర్తయ్యాయి. 136 రహదారి పనులు పలు దశల్లో ఉండగా, మరో 26 పనులు ప్రారంభం కావాల్సి ఉంది. పార్వతీపురం డివిజన్ మొత్తానికి 220 రహదారులకు గాను 24 పూర్తయ్యాయి. మరో 151 బీటీ రహదారులు పలు దశల్లో ఉన్నాయి. 44 రహదారి పనులు ప్రారంభం కావాల్సి ఉంది. పాలకొండ సెక్షన్‌లో పాలకొండ, భామిని, సీతంపేట, వీరఘట్టం మండలాల్లో 20 రహదారులకు గాను నాలుగు పూర్తయ్యాయి. 16 రహదారులు వివిధ దశల్లో ఉన్నాయి.

జిల్లాలో చేపడుతున్న బీటీ రహదారుల పనుల్లో అధికంగా నాణ్యతా లోపాలు కనిపిస్తున్నాయి. రహదారులకు ఇరువైపులా బెర్మ్‌లు ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సంబంధిత రహదారులకు ఉపయోగించే వెట్ మిక్స్‌లో ప్రమాణాలు తక్కువగా ఉండడంతో రాతి బుగ్గి దర్శనమిస్తోంది. అదేవిధంగా మెటీరియల్‌లో కూడా లోపాలు నెలకొన్నట్లు పలు గ్రామాలకు వారు విమర్శిస్తున్నారు. అధికారుల సూచనల మేరకు మార్చి 10 లోగా జిల్లాలోని పలు మండలాల్లో అధికంగా సీసీ రహదారుల నిర్మాణం పూర్తి చేశారు. అయితే రెండు నెలలు గడుస్తున్నా .. నేటికీ బిల్లులు చెల్లింపులు కాలేదు. అధికారుల హామీతో రాత్రి, పగలు తేడా లేకుండా పంచాయతీల్లో పనులు పూర్తి చేసిన వారు ప్రస్తుతం బిల్లుల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. అప్పులు చేసి పనులు పూర్తి చేసిన కొంతమంది నిత్యం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఏదేమైనా చెల్లింపుల్లో తీవ్ర జాప్యం నెలకొనడంతో వారికి చెమటలు పడుతున్నాయి.

# ఖరీఫ్ వేళ... నకిలీ విత్తనాల గోల ..!

**అనంతపురం, పతాకం న్యూస్:** జిల్లాలో రైతుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా మారింది. ఒకవైపు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతుంటే మరోవైపు నకిలీ విత్తనాల సమస్య మరింత జటిలంగా మారింది. ఖరీఫ్ కు ముందు చాలా కంపెనీలు వచ్చి రైతులకు విత్తనాలు ఇచ్చి వెళుతుంటాయి. అయితే ఆ విత్తనాలు నాసిరకమైనవిగా ఉంటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి సగంపైగా పంట ఉండటం లేదని నిత్యం అధికారుల ముందు తమ గోడు వెళ్ళబోసుకుంటున్నారు. విత్తనాల కంపెనీల సిబ్బందిని అడిగితే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట సాగుకు ముందు నగరంలో ఆఫీస్ ఓపెన్ చేయడం వాళ్ళ బిజినెస్ అయిపోయాక మొఖం చాటేస్తున్నారు. 20 నుండి 30 కంపెనీలు రైతుల చుట్టూ తిరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుంది. జిల్లాలో ప్రధాన పంటలుగా పత్తి, వేరుశనగ, కంది, మొక్కజొన్న, వరి, ఉల్లి, మిర్చి 4 లక్షల హెక్టార్లలో సాగుచేస్తున్నారు. జులై నెల మధ్య వరకు దాదాపు 2 లక్షల హెక్టర్ల పంట సాగులోకి రాగా, ఆగస్టు చివరికల్లా 4 లక్షల హెక్టర్ల పంట సాగుకు సిద్ధం అవుతుంది. 2024 నుండి 2025 మధ్యలో దాదాపు 1 లక్ష ఎకరాల పంట నకిలీ విత్తనాల పాలైంది. ప్రతీ సంవత్సరం నకిలీ విత్తనాల ఎఫెక్ట్ తో ఇబ్బందిపడుతున్న రైతులను ఇటు అధికారులు, అటు ప్రభుత్వాలు పట్టించుకోవడం మానేశారు. కంపెనీల ప్రతినిధులకు రైతులు ఎన్ని సార్లు తమ గోడు వెళ్ళబోసుకున్నా ఫలితం లేకుండా పోతుంది. దీంతో రైతులు గత్యంతరం లేక ధర్నాలు, నిరసనలు చేసి కాలం వెళ్లదీస్తున్నారు. ప్రస్తుతం రైతులు సేద్యానికి పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ సమయంలో నకిలీ గ్యాంగ్ గ్రామాలకు చేరి నకిలీ విత్తనాలను అమ్ముతున్నారు. నకిలీ విత్తనాల మాఫియా జిల్లాలో పెరిగిపోతుంది. గతంలో కేవలం జిల్లా కేంద్రంలో మాత్రమే ఉన్న ఈ మాఫియా ప్రస్తుతం ఆత్మకూరు కూడేరు రాప్తాడు కనగానపల్లి అనంతపురం రూరల్ మండలం వంటి ప్రాంతాలకు పాకిపోయింది. ఉమ్మడి జిల్లా నుండి ప్రతీ




సంవత్సరం దాదాపు రూ.5 నుండి రూ.10 కోట్ల మేర వ్యాపారం చేసుకుంటున్నారు. విత్తనాల యజమానులు స్థానిక రాజకీయ నాయకులతో కుమ్మక్కు అవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాయకుల కనుసన్నల్లో ఈ వ్యవహారం జరుగుతుందడంతో అధికారులు మంకెందుకులే అన్నట్టు వెళ్లిపోతున్నారని చర్చ జరుగుతుంది. నకిలీ విత్తనాల వల్ల ప్రతీ సంవత్సరం అధిక సంఖ్యలో పంట నష్టమవుతుంది. 2023 లో దాదాపు 20 లక్షల హెక్టర్ల పంట నష్టపోగా, 2025 లో పంట నష్టం అంచన 25 లక్షల హెక్టర్లకు చేరింది. 2026లో దీని అంచనా దాదాపు 30 లక్షలకు చేరింది. కేవలం 10 లక్షల హెక్టర్ల పంట మాత్రమే ఈ నకిలీ విత్తనాల నుండి బయటపడిందని అంచనా.

## ఆధార్ అప్‌డేట్‌కు ప్రత్యేక క్యాంపులు




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** రాష్ట్రంలోని విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ నవీకరణ తప్పనిసరిగా చేసుకోవాల్సిన వారి కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకూ, 19 నుంచి 22వ తేదీ వరకూ రెండు విడతలుగా నిర్వహించనున్నట్లు స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల శాఖ వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లుకు ఆ శాఖ డైరెక్టర్ ఎం. శివ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. యుఐడిఎఐ పోర్టల్ నివేదిక ప్రకారం రాష్ట్రంలో మొత్తం 16.51 లక్షల మంది విద్యార్థులకు ఆధార్ బయోమెట్రిక్ నవీకరణ అవసరమని గుర్తించినట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన ప్రత్యేక క్యాంపుల్లో 4.53 లక్షల బయోమెట్రిక్ నవీకరణ పూర్తికాగా, ఇంకా 11.99 లక్షల మందికి సంబంధించి పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా 15 నుంచి 17 ఏళ్ల మధ్య వయస్సు గల జూనియర్ కాలేజీ విద్యార్థులపై దృష్టి సారించాలని సూచించారు. నీట్, జెఇఇ వంటి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వారి ఆధార్ బయోమెట్రిక్ ను నవీకరించుకోకపోతే పరీక్షలకు అనుమతి లభించకపోవచ్చని హెచ్చరించారు.

## భూ పంపిణీతోనే దేశాభివృద్ధి

**వ్యవసాయ కార్మిక సంఘ నేతల డిమాండ్**




**అమలాపురం, పతాకం న్యూస్:** భూ పంపిణీతోనే నిజమైన దేశాభివృద్ధి జరుగుతుందని వ్యవసాయ కార్మికసంఘం నేతలు అన్నారు. ఆ సంఘ 30వ రాష్ట్ర మహాసభ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమలాపురంలో రాష్ట్రం నలుమూలల నుండి తరలివచ్చిన వేలాదిమంది వ్యవసాయ కార్మికులు ఎర్రజెండాలతో కదం తొక్కారు. ఈదరపల్లి నుండి గడియారస్తంభం సెంటర్ వరకూ ఈ భారీ ర్యాలీ జరిగింది. ప్రదర్శన జరిగిన మార్గంలో ఎక్కడ చూసినా ఎర్రజెండా రెపరెలు కనిపించాయి. భూపంపిణీ చేయాలి, ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి, శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలంటూ వ్యవసాయ కార్మికులు చేసిన నినాదాలతో అమలాపురం పట్టణం మార్రుమోగింది. అనంతరం అనంతరం గడియారస్తంభం సెంటర్లోని కామ్రేడ్ సీతారాం ఏచూరి, కామ్రేడ్ సునీత్ చోప్రా సభావేదిక(మున్సిపల్ వేదిక)పై వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సభలో మాట్లాడిన వక్తలు భూ పంపిణీ ద్వారా మాత్రమే ఉత్పత్తి రంగం పెరిగి, నిత్యావసరాల ధరలు తగ్గుతాయని అన్నారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ పేదల ఓట్లతో అధికారంలోకి వచ్చిన పాలకులు పెద్దలకు లక్షల ఎకరాలు కట్టబెడుతున్నారని, పేదలకు ఇచ్చేందుకు మాత్రం సిద్ధపడటం లేదని అన్నారు. ఇప్పటికీ 70 నుండి 80 శాతం మంది పేదలు, దళితుల చేతుల్లో భూములు లేవని, వారికిచ్చిన వాటిని కూడా పెద్దలే ఆక్రమించుకుని అనుభవిస్తున్నారని అన్నారు. తాము అధికారంలోకి వస్తే భూమిలేని పేదలకు రెండు ఎకరాల భూమి ఇస్తామని చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించిందని, ఇప్పటి వరకూ ఆ దిశలో చర్యలు తీసుకోలేదని అన్నారు. రెండు నెలల్లో పేదలకు భూములు పంచకపోతే వాటిని తామే పేదలకు పంచుతామని హెచ్చరించారు. భూములు లాగేసుకోవడంతోపాటు, చదువుకున్నవారికి ప్రభుత్వాలు ఉపాధి చూపించకపోవడంతో నిరుద్యోగం పెరుగుతోందన్నారు. అదే సమయంలో ప్రభుత్వ రంగ సంస్థలనూ అమ్మేస్తున్నారని అన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతోపాటు ప్రైవేటురంగంలోనూ రిజర్వేషన్లు పెట్టాలని డిమాండు చేశారు. మతానికి రిజర్వేషన్లు ముడిపెట్టడం సరికాదన్నారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వాలు పేదలను భూముల్లో నుండి తరిమేస్తున్నాయన్నారు.

## ఏసీబీకి పట్టుబడిన ఇంచార్జ్ హెల్త్ ఆఫీసర్




**అనంతపురం, పతాకం న్యూస్:** అంతపురం మున్సిపల్ కార్పొరేషన్ లో 25 వేల రూపాయల లంచం తీసుకుంటూ ఇంచార్జ్ హెల్త్ ఆఫీసర్, డిఈఈ బిఎల్ నరసింహ ప్రజారోగ్య విభాగపు ఎఫ్ వన్ గుమాస్తా సందీప్ చౌత ఎసిబి అధికారులు జరిపిన మెరుపు దాడిలో పట్టుబడ్డారు. నెల రోజులుగా ఎగ్జిబిషన్ అనుమతికై దరఖాస్తు చేసుకున్న బాలభారతి ట్రేడ్ ఎగ్జిబిషన్ నిర్వాహకుడు రఘు ప్రసాదరావును మంజూరు పత్రం కావాలంటే లంచం ఇవ్వాల్సిందేనని హెల్త్ ఆఫీసర్ బిఎల్ నరసింహ డిమాండ్ చేశారు. ఇంచార్జ్ హెల్త్ ఆఫీసర్ బిఎల్ నరసింహ ఈ ఏడాది రిపబ్లిక్ డే పెరియడ్ ఉత్సవాలలో జిల్లా ఉత్తమ అధికారిగా అప్పటి కమిషనర్ బాలస్వామి సిఫారసుతో సత్కరించబడ్డారు. ఎసిబి డిఎస్పి ప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి ఎల్ నరసింహ చార్జ్ హెల్త్ ఆఫీసర్ గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బాల భారతి ఎగ్జిబిషన్ నిర్వాహకుడు ఎగ్జిబిషన్ ఏర్పాటుకై మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి కోరుతూ నెల రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే ఇంచార్జ్ హెల్త్ ఆఫీసర్ బిఎల్ నరసింహ 30 వేల రూపాయలు లంచం డిమాండ్ చేశారన్నారు. నెల రోజులుగా మంజూరు పత్రం కై ఎగ్జిబిషన్ నిర్వాహకుడు రఘు ప్రసాదరావు తిరుగుతున్న పట్టించుకోలేదన్నారు. లంచం ముట్ట చెపితే గాని మంజూరు పత్రం ఇవ్వబోమని హెల్త్ ఆఫీసర్ నరసింహ తేల్చి చెప్పటంతో ఆయన సంప్రదించారన్నారు. సోమవారం లంచం డబ్బులు ఇవ్వటానికి ఎగ్జిబిషన్ నిర్వాహకుడు హెల్త్ ఆఫీసర్ బి ఎల్ నరసింహా ను సంప్రదించగా ఎఫ్ వన్ గుమస్తా సందీప్ చౌత కు ఇవ్వాలని సూచించారు. దీనితో గుమాస్తా సందీప్ చౌరస్తా స్థానిక డిఆర్ డిఏ ప్రాంగణంలోని ఆర్డిఓ ఆఫీస్ వద్ద ప్రజారోగ్య విభాగ గుమాస్తా సందీప్ చౌత 25 వేల రూపాయలు లంచం తీసుకున్నారని తెలిపారు. అక్కడి నుంచి గుమస్తా సందీప్ చౌత నేరుగా ఇన్చార్జ్ హెల్త్ ఆఫీసర్ డి ఈ ఈ బిఎల్ నరసింహా ను కలిసి లంచం డబ్బులు అందజేశారు. దీనితో సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఎసిబి అధికారులు మున్సిపల్ కార్పొరేషన్ ఇంచార్జ్ హెల్త్ ఆఫీసర్ అయిన డి ఈ ఈ బి ఎల్ నరసింహ గదికి వెళ్లారు. ఆయన గది వద్దకే అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఉన్న ఎఫ్ వన్ గుమాస్తా సందీప్ చౌతాను తీసుకువచ్చారు. రసాయనాలతో లంచం డబ్బులు తీసుకున్న అధికారి నర్సింహను గుమాస్తా సందీప్ చౌతాను తనిఖీ చేసి పట్టుకున్నారు.

## తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన బండి సంజయ్ కుమారుడు



**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ తనపై నమోదైన పోక్సో కేసును సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై నమోదైన కేసులో ఎలాంటి వాస్తవం లేదని, ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఈ నెల 14వ తేదీన హైకోర్టు వెకేషన్ బెంచ్‌లో విచారణ జరగనుంది. న్యాయస్థానం ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. కేసు వివరాల్లోకి వెళితే... ఒక 17 ఏళ్ల మైనర్ బాలికను భగీరథ్ వేధిస్తున్నాడంటూ ఆ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మే 8వ తేదీన హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. అయితే, ఈ ఆరోపణలను భగీరథ్ తరపున వర్గాలు ఖండిస్తున్నాయి. ఇది కావాలని చేస్తున్న కుట్రగా వారు పేర్కొంటున్నారు. మరో ఆసక్తికరమైన మలుపు ఏంటంటే... ఆ బాలిక, ఆమె తల్లి తనను డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని భగీరథ్ కూడా ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు అదే రోజు (మే 8) కరీంనగర్ పోలీసులు బాలిక, ఆమె తల్లిపై కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల విచారణ ప్రస్తుతం కొనసాగుతోంది.


## తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత

**హైదరాబాద్, పతాకం న్యూస్:** మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. జార్ఖండ్‌లోని సరండా ఫారెస్ట్‌లో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. పొలిట్ బ్యూరో సభ్యుడు మిసిర్ బెస్ర కోసం కూంబింగ్ కొనసాగుతున్న సమయంలో .... నరహరి తన భార్యతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. నరహరి స్వస్థలం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడి కాగా, అతని భార్య ఎపి కి చెందిన మహిళగా తెలుస్తుంది. 1996 నుంచి అజ్ఞాతంలో ఉన్న నరహరి పలు కీలక ఆపరేషన్స్‌లో పాల్గొన్నారు. మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేతలు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మిసిర్ బెస్ర కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది.

# మధ్య వయస్సులో విటమిన్ డి తగ్గితే.. వృద్ధాప్యంలో ఇబ్బందే..

ఎముకల బలానికి, శరీర ఆరోగ్యానికి విటమిన్ డి అవసరమని అందరికీ తెలిసిందే. కానీ ఇప్పుడు శాస్త్రవేత్తలు చెబుతున్న విషయం మరింత ఆందోళన కలిగిస్తోంది. 30-40 ఏళ్ల వయసులో శరీరంలో ఉన్న విటమిన్ డి స్థాయిలు, 60-70 ఏళ్ల వయసులో మెదడు ఆరోగ్యాన్ని నిర్ణయించే అవకాశం ఉందని తాజా అధ్యయనం వెల్లడించింది. అంటే ఇప్పుడు ఉన్న విటమిన్ డి లోపం భవిష్యత్తులో మెదడు క్షీణత, జ్ఞాపకశక్తి తగ్గుదల వంటి సమస్యలకు కారణం అయ్యే అవకాశాలు ఉంటాయ న్నమాట. న్యూరాలజీ ఓపెన్ యాక్సెస్ అనే జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనంలో దాదాపు 800 మందిని 16 సంవత్సరాల పాటు పరిశీలించారు. పరిశోధకులు గుర్తించిన ముఖ్యమైన విషయం ఏమిటంటే మధ్య వయస్సులో విటమిన్ డి స్థాయిలు ఎక్కువగా ఉన్న వారిలో, వృద్ధాప్యంలో మెదడులో టావ్ ప్రోటీన్ స్థాయిలు తక్కువగా కనిపించాయి. ఈ టావ్ ప్రోటీన్ అసాధారణంగా గుంపులుగా చేరితే మెదడులో టాంగిల్స్ ఏర్పడతాయి. ఇవి అల్జీమర్స్, డిమెన్షియా వంటి వ్యాధులకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఈ టాంగిల్స్ నాడీకణాలను దెబ్బతీసి మెదడు క్షీణతకు దారితీస్తాయి.

పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, విటమిన్ డి మెదడుకు రక్షణ కవచంలా పనిచేస్తుంది. ఇది నాడీకణాల మధ్య జరిగే హానికర మార్పులను తగ్గించి, మెదడు




వృద్ధాప్యాన్ని నెమ్మదింపజేస్తుంది. అందుకే సరైన స్థాయిలో విటమిన్ డి ఉండడం భవిష్యత్తులో జ్ఞాపకశక్తి సమస్యలను తగ్గించడంలో కీలకంగా మారుతోంది. ఇక భారతదేశం సూర్యరశ్మి సమృద్ధిగా ఉండే దేశం అయినప్పటికీ, విటమిన్ డి లోపం పెద్ద సమస్యగా మారింది. జర్నల్ ఆఫ్ ఫ్యామిలీ మెడిసిన్ అండ్ ప్రైమరీ కేర్ లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం, దేశంలోని 70 శాతం నుంచి 90 శాతం మంది వరకు విటమిన్ డి లోపంతో బాధపడుతున్నారు. ఎక్కువ సమయం ఇంటి లోపల గడపడం, కాలుష్యం పెరగడం, చర్మంలో మెలనిన్ అధికంగా ఉండటం వల్ల సూర్యరశ్మి నుంచి విటమిన్ డి తక్కువగా ఉత్పత్తి కావడం వంటి వాటిని విటమిన్ డి లోపం తలెత్తడానికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

అలాగే హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ నిర్వహించిన మరో అధ్యయనంలో కూడా విటమిన్ డి తక్కువగా ఉన్న మధ్యవయస్కులలో మెదడు పనితీరు తగ్గినట్లు గుర్తించారు. నిపుణులు 30-40 ఏళ్ల వయస్సును గోల్డెన్ విండోగా అభివర్ణిస్తున్నారు. ఈ దశలో సరైన జాగ్రత్తలు తీసుకుంటే భవిష్యత్తులో మెదడు క్షీణత ప్రమాదాన్ని తగ్గించవచ్చని వారు చెబుతున్నారు. వయసులో ఉన్నప్పుడు ఎలాంటి లక్షణాలు కనిపించకపోయినా, విటమిన్ డి లోపం ప్రభావం నెమ్మదిగా కొన్ని సంవత్సరాల తర్వాత బయటపడే అవకాశం ఉంది. అందుకే ముందుగానే జాగ్రత్తలు అవసరం. కనుక ముందు నుండే విటమిన్ డి స్థాయిలను మెరుగుపరుచుకోవాలి.

విటమిన్ డి పరీక్షలు చేయించుకోవాలి. 25-హైడ్రాక్సీ విటమిన్ డి రక్తపరీక్ష ద్వారా శరీరంలో విటమిన్ డి స్థాయిలను తెలుసుకోవచ్చు. వారంలో కనీసం మూడు రోజులు, మధ్యాహ్నం 11 గంటల నుంచి 1 గంట మధ్య 15-20 నిమిషాలు సూర్యరశ్మిలో గడపడం మంచిది. ఫ్యాటీ ఫిష్, ఫోర్టిఫైడ్ పాలు వంటి ఆహారాలను తీసుకోవాలి. అవసరమైతే వైద్యుల సలహాతో విటమిన్ డి3 సప్లిమెంట్లు తీసుకోవాలి. విటమిన్ డి కేవలం ఎముకల ఆరోగ్యానికే కాదు, భవిష్యత్తులో మెదడు ఆరోగ్యానికి కూడా కీలకమని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. చిన్న వయస్సులో తీసుకునే జాగ్రత్తలు వృద్ధాప్యంలో జ్ఞాపకశక్తిని, ఆలోచనా సామర్థ్యాన్ని కాపాడుతాయి. అందుకే విటమిన్ డి స్థాయిలను నిర్లక్ష్యం చేయకుండా ఇప్పటి నుంచే శ్రద్ధ పెట్టడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

## హర్మూజ్‌పై ఇరాన్ కొత్త రూల్స్.. టోల్ ఫీజు కడితేనే ఎంట్రీ.. భారత్‌కు మినహాయింపు



**ఇరాన్:** ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు 20 శాతం రవాణా జరిగే అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఇప్పుడు పూర్తి స్థాయి నియంత్రణను సాధించింది. ఫిబ్రవరి 28న యుద్ధం మొదలైనప్పటి నుంచి ఈ మార్గంలో నౌకలను అడ్డుకుంటున్న ఇరాన్, ఇప్పుడు ఏకంగా టోల్ ఫీజు వసూలు చేసేందుకు అధికారికంగా కొత్త నిబంధనలను అమలులోకి తెచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చే దేశాలకు తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిస్తోంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వేళ ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. షిప్పింగ్ ఇండస్ట్రీ జర్నల్ లాయిడ్స్ లిస్ట్ కథనం ప్రకారం హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకల కోసం ఇరాన్ పర్షియన్ గల్ఫ్ స్ట్రెయిట్ అథారిటీ పేరిట ఒక కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఈ మార్గంలో వెళ్లాలనుకునే ప్రతి నౌకా ముందుగా అనుమతి తీసుకోవడంతో పాటు, టోల్ ఫీజు చెల్లించడం తప్పనిసరి. దీని కోసం వెసెల్ ఇన్ఫర్మేషన్ డిక్లరేషన్ పేరుతో ఒక ఫామ్‌ను విడుదల చేసింది. ఇందులో దాదాపు 40కి పైగా ప్రశ్నలు ఉన్నాయి. నౌక పేరు, గుర్తింపు నంబర్, నౌక యజమాని, ఇన్సూరెన్స్ వివరాలు, ఏ దేశం నుంచి వస్తోంది? ఎక్కడికి వెళ్తోంది? నౌకలో ఉన్న సిబ్బంది, సరకు వివరాలు ఇలా ప్రతి చిన్న విషయాన్ని పక్కాగా మెయిల్ చేయాల్సి ఉంటుంది. వీటన్నింటిని పరిశీలించిన తర్వాత నౌకలకు తదుపరి సూచనలు ఈమెయిల్ ద్వారా తెలియజేస్తారు. అయితే, తప్పుడు సమాచారం ఇస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది. ఈ టోల్ ఫీజు ద్వారా వచ్చిన తొలి ఆదాయాన్ని కూడా ఇరాన్ ఇప్పటికే అందుకున్నట్లు ఆ దేశ పార్లమెంట్ డిప్యూటీ స్పీకర్ గత నెలలోనే ప్రకటించారు. కొన్ని నౌకలు రవాణా అనుమతి కోసం 2 మిలియన్ డాలర్ల వరకు చెల్లించినట్లు షిప్పింగ్ ఇండస్ట్రీ జర్నల్ లాయిడ్స్ లిస్ట్ కథనం పేర్కొంది. అయితే హర్మూజ్ జలసంధిలో కొన్ని దేశాలకు ప్రవేశం లేదు. ఎవరిని అనుమతించాలి, ఎవరిని అడ్డుకోవాలి అనేది పూర్తిగా ఇరాన్ నిర్ణయమే. ముఖ్యంగా తమ దేశంపై ఆంక్షలు విధిస్తున్న అమెరికా, ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చే దేశాల నౌకలను ఏమాత్రం అనుమతించే ప్రసక్తే లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. అమెరికాకు మద్దతు ఇస్తే హర్మూజ్ జలసంధి తలుపులు మీ కోసం శాశ్వతంగా మూసుకుపోతాయని బహ్రెయిన్‌కు వార్నింగ్ ఇచ్చింది. ఇదే సమయంలో భారత్‌కు ఒక ఊరట లభించింది. భారత్, పాకిస్థాన్ జెండాలు ఉన్న నౌకలకు మాత్రం హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించేందుకు ఇరాన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# శిథిలావస్థకు చేరిన ధారగెడ్డ ఆనకట్ట

## పొలాలకు నీరు అందక రైతుల ఇబ్బందులు..



**గొలుగొండ, పతాకం న్యూస్:** మండలంలో వివిధ రకాల సాగునీటి వనరులు ఏళ్ల తరబడి నిర్వహణ, అభివృద్ధి పనులకు నోచుకోకపోవడంతో ఆయకట్టుకు సరిగా నీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. చెరువులు, వివిధ ఆనకట్టలకు పనుల కోసం ఎనిమిది కోట్ల రూపాయలు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం 'జలధార- జలహారతి' కార్యక్రమం కింద రూ.44 లక్షలు మాత్రమే మంజూరు చేసింది. ఇవి కూడా గొలుసు కట్టుచెరువులకు సంబంధించి కాలువల్లో పూడికతీత, తుప్పల తొలగింపు పనులు చేయడానికి కేటాయించింది.

మండలంలో 119 సాగునీటి చెరువులు, 13 ఆనకట్టలు వున్నాయి. గతంలో 2016-17లో టీడీపీ హయాంలో నీరు-చెట్టు కార్యక్రమం కింద చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టారు. మదుములకు గేట్లు ఏర్పాటు చేశారు. తరువాత వైసీపీ ఐదేళ్ల పాలనలో వీటి నిర్వహణ.. అంటే పూడికతీత, తుప్పలు తొలగింపు, మదుములు, గేట్లకు మరమ్మతు పనులు ఒక్క ఏడాది కూడా చేపట్టలేదు. దీంతో సాగునీటి వనరుల పరిస్థితి అధ్వానంగా తయారైంది.

మదుముల గేట్లు పాడైపోవడంతో నీరు వృథాగా పోయి, పంట చివర దశలో నీటి కొరత ఏర్పడుతున్నది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలోని పలు మండలాల్లో సాగునీటి వనరుల నిర్వహణ, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసింది. ఉపాధి హామీ పథకం కింద పూడికతీత, తుప్పల తొలగింపు పనులు జరుగుతున్నాయి. కానీ గొలుగొండ మండలానికి నిధులు కేటాయించలేదు. మండలంలో వివిధ రకాల సాగునీటి వనరుల నిర్వహణ, మరమ్మతులు, అభివృద్ధి పనుల కోసం రూ.8 కోట్లు అవసరమని జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే 'జలధార- జలహారతి' కార్యక్రమం కింద గొలుసు కట్టుచెరువులకు సంబంధించి కాలువల్లో పూడికతీత, తుప్పల తొలగింపు పనులు చేయడానికి రూ.44 లక్షలు మాత్రమే మంజూరు చేసింది. మండలంలోని పాతమల్లంపేటలో ధారగెడ్డ ఆనకట్ట, దానికి అనుసంధానంగా వున్న చెరువుల కింద సుమారు మూడు వేల ఎకరాల ఆయకట్టు వుంది. ఆనకట్ట దెబ్బతినడం, గేట్లు పాడైపోవడం, చెరువుల మదుములు మరమ్మతుకు గురవడంతో ఎగువ నుంచి వచ్చే వర్షం నీరు వచ్చింది వచ్చినట్టు దిగువకు వృథాగా పోతున్నది. దీనివల్ల వరి పంట పొట్ట దశలో నీరు అందుబాటులో లేక దిగుబడులు తగ్గిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.




## అక్షర్, మిల్లర్ విజృంభణ..

# ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం



ప్రతీ మ్యాచ్‌ను గెలిచి తీరాల్సిన స్థితిలో.. ఢిల్లీ క్యాపిటల్స్ ఉత్కంఠను అధిగమిస్తూ అద్భుత ఆటతీరును కనబర్చింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓటమి ఖాయమనుకున్న దశలో మరో ఓవర్ ఉండగానే భారీ స్కోరును ఛేదించి 3 వికెట్ల తేడాతో గెలిచింది. ప్రస్తుతం 10 పాయింట్లతో ఉన్న ఢిల్లీ మిగిలిన రెండు మ్యాచ్‌లను కూడా గెలిచి ఇతర జట్ల ఫలితాల కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది. ఇక ఆరంభంలో జైత్రయాత్ర సాగించిన శ్రేయాస్ సేనకిది వరుసగా నాలుగో ఓటమి. ముందుగా పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 210 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ (36 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 59 నాటౌట్), ప్రియాన్ష్ ఆర్య (33 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సర్లతో 56), కూపర్ (27 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 38) రాణించారు. మాధవ్, స్టార్క్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 19 ఓవర్లలో 216/7 స్కోరు చేసి గెలిచింది. కెప్టెన్ అక్షర్ పటేల్ (30 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 56), డేవిడ్ మిల్లర్ (28 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 51) కీలక ఇన్నింగ్స్‌తో ఆదుకున్నారు. చివర్లో అశుతోష్ (10 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 24), మాధవ్ తివారి (8 బం తుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 18 నాటౌట్) చెలరేగారు. అర్ష్‌దీప్, యష్‌లకు రెండేసి వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా మాధవ్ తివారి నిలిచాడు. భారీ ఛేదనలో ఢిల్లీ ఆరంభంలోనే టపటపా వికెట్లను కోల్పోయింది. కానీ అక్షర్, మిల్లర్ సమన్వయంతో పాటు చివర్లో టెయిలెండర్ల దూకుడుతో మరో ఓవర్ ఉండగానే కీలక విజయాన్నందుకుంది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ అభిషేక్ పోరెల్ (5)ను పేసర్ యష్ అవుట్ చేయగా.. తన వరుస ఓవర్లలో రాహుల్ (9), సాహిల్ (13)లను అర్ష్‌దీప్ పెవిలియన్ చేర్చాడు. దీంతో 33/3 స్కోరుతో ఢిల్లీ కష్టాల్లో పడింది. పవర్‌ప్లేలో ఢిల్లీ చేసింది 47 పరుగులే. 9వ ఓవర్‌లో స్టబ్స్ (12) రనౌటవడం మరింత దెబ్బతీసింది. ఈ పరిస్థితిలో మిల్లర్ సహకారంతో అక్షర్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. 14వ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో ఆకట్టుకున్న అక్షర్ 28 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. కానీ మరో భారీషాట్‌కు వెళ్లి డ్వార్షస్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో ఐదో వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మిల్లర్ మాత్రం ధాటిని కొనసాగిస్తూ బౌండరీలతో ఉత్కంఠ పెంచాడు. రెండు వరుస సిక్సర్లతో 27 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసిన అతడిని పేసర్ డ్వార్షస్ అవుట్ చేయడంతో పంజాబ్ ఊపిరిపీల్చుకుంది. కానీ 18వ ఓవర్‌లో అశుతోష్ 4,6 మాధవ్ 6తో 19 పరుగులు రావడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. 12 బంతుల్లో 17 రన్స్ కావాల్సిన వేళ 19వ ఓవర్‌లో అశుతోష్ వికెట్ కోల్పోయినా.. మాధవ్, అకీబ్ (2 బంతుల్లో ఓ ఫోర్, సిక్సర్‌తో 10 నాటౌట్) జోరుకు 22 పరుగులు రావడంతో మ్యాచ్ ముగిసింది. చివరి నాలుగు ఓవర్లలోనే ఢిల్లీ 73 రన్స్ రాబట్టడం విశేషం. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ ప్రియాన్ష్ ధనాధన్ ఆటతో రెచ్చిపోయాడు. మధ్య ఓవర్లలో శ్రేయాస్ అండగా నిలిచి అజేయ అర్ధసెంచరీతో జట్టు స్కోరును 200 దాటించాడు. తొలి ఓవర్‌లోనే ప్రియాన్ష్ రెండు సిక్సర్లు బాదడంతో ఏకంగా 22 పరుగులతో పంజాబ్‌కు మెరుపు ఆరంభం లభించింది. ఇక మూడో ఓవర్‌లోనూ ప్రియాన్ష్ 6,6,4తో చెలరేగడంతో జట్టు 16 బంతుల్లోనే 50 పరుగులు పూర్తి చేసింది. అయితే సహజశైలిలో ఆడలేకపోయిన మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (18)ను పవర్‌ప్లే తర్వాత పేసర్ ముకేశ్ అవుట్ చేశాడు. తొలి వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. ఇక 24 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసిన ప్రియాన్ష్‌ను కూడా కాసేపటికే పేసర్ మాధవ్ పెవిలియన్‌కు చేర్చాడు.

## ఫ్రాంచైజీ యజమానుల తీరుపై బీసీసీఐ తీవ్ర అసంతృప్తి



ఐపిఎల్ 2026 సీజన్‌లో ఫ్రాంచైజీ యజమానుల ప్రవర్తనపై బిసిసిఐ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. లీగ్‌కు సంబంధించిన నిబంధనలు, ప్రోటోకాల్స్‌ను పలుమార్లు ఉల్లంఘిస్తున్నారని గుర్తించిన బోర్డు.. ఇకపై అలాంటి చర్యలను సహించబోమని స్పష్టం చేసింది. మ్యాచ్‌ల సమయంలో యజమానులు డగౌట్‌కు దూరంగా ఉండాలని, ఆటగాళ్లు లేదా జట్టు సిబ్బందితో ప్రత్యక్షంగా లేదా సంకేతాల ద్వారా ఎలాంటి సంప్రదింపులు జరపకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ, కొన్ని ఫ్రాంచైజీల ప్రతినిధులు వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తాయి. డగౌట్ సమీపంలో యజమానులు కనిపించిన ఫొటోలు, మైదానంలోకి మొబైల్ ఫోన్లు తీసుకెళ్లిన ఘటనలు బిసిసిఐ దృష్టికి వచ్చినట్లు సమాచారం. పలుమార్లు హెచ్చరించినా మార్పు కనిపించకపోవడంతో బోర్డు కఠిన వైఖరి అవలంబించిందని అధికారులు తెలిపారు. జట్టు యజమానుల ప్రవర్తనే ప్రస్తుతం అత్యంత ఆందోళన కలిగించే అంశంగా మారిందని ఒక అధికారి వ్యాఖ్యానించారు. ఇక ఈ సీజన్‌లో చోటుచేసుకున్న కొన్ని అవాంఛనీయ ఘటనలు, భద్రతా నిబంధనల ఉల్లంఘనలను బిసిసిఐ అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) సీరియస్‌గా తీసుకుంది. దీనితో వెంటనే కొత్త మార్గదర్శకాలు అమల్లోకి తెచ్చింది. ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది, జట్టు అధికారుల హోటల్ గదుల్లోకి అనుమతి లేని వ్యక్తులను అనుమతించకూడదని స్పష్టం చేసింది. ఏ అతిథి అయినా ఆటగాళ్ల గదికి వెళ్లాలంటే తప్పనిసరిగా జట్టు మేనేజర్ నుంచి లిఖితపూర్వక అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ మార్గదర్శకాలపై అన్ని 10 ఫ్రాంచైజీల సిఇఒ లకు బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ప్రత్యేక లేఖలు పంపినట్లు సమాచారం.




# చిరంజీవి 'విశ్వంభర' రెండు పార్టులా?

## “నిజమా” అంటూ దర్శకుడి సెటైర్!



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న భారీ చిత్రం 'విశ్వంభర'పై సోషల్ మీడియాలో వస్తున్న ఓ కీలక ప్రచారానికి దర్శకుడు వశిష్ట తెరదించారు. ఈ సినిమాను రెండు భాగాలుగా విడుదల చేయనున్నారంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. దీంతో ఈ సినిమా విడుదలపై నెలకొన్న ఓ ప్రధాన సందేహానికి తెరపడినట్లయింది. 'విశ్వంభర' రెండు భాగాలుగా రాబోతోందంటూ ఇటీవల ప్రచారం జోరుగా సాగింది. దీనిపై ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు దర్శకుడు వశిష్ట స్పందిస్తూ.. “ఓహో, నిజమేనా?” అని వ్యంగ్యంగా బదులిచ్చారు. ఆయన సమాధానంతో ఈ చిత్రం ఒకే భాగంగా ప్రేక్షకుల ముందుకు రానుందని తేలిపోయింది.

వశిష్ట దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సంస్థ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. సోషియో ఫాంటసీ కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాలో చిరంజీవి సరసన త్రిష కథానాయికగా నటిస్తున్నారు. సృష్టి, స్థితి, లయ అనే అంశాల చుట్టూ ఈ కథ సాగుతుందని సమాచారం. ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి దీనికి సంగీతం అందిస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి.

ఈ చిత్రంలో ఆషిక రంగనాథ్, రమ్య పసుపులేటి, ఇషా చావ్లా వంటి ఇతర తారలు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వాస్తవానికి ఈ సినిమాను ఎప్పుడో విడుదల చేయాలని భావించినా, చిత్రీకరణలో జాప్యం కారణంగా వాయిదా పడింది. ప్రస్తుతం సినిమా షూటింగ్ ఏ దశలో ఉందనే దానిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# 21న థియేటర్స్‌లో..'దృశ్యం 3'



మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'దృశ్యం 3' తెలుగు ట్రైలర్ విడుదలైంది. సోమవారం విడుదలైన ఈ ట్రైలర్‌తో తెలుగు ప్రేక్షకుల్లో ఉన్న ఓ ముఖ్యమైన సందేహానికి తెరపడింది. గత రెండు భాగాల్లా కాకుండా, ఈసారి వెంకటేష్‌తో రీమేక్ ఉండదని, మలయాళ వెర్షన్‌నే తెలుగులో డబ్ చేసి విడుదల చేయనున్నారని స్పష్టమైంది. మోహన్‌లాల్ పుట్టినరోజు సందర్భంగా మే 21న ఈ చిత్రం మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది. ఈసారి కథలో కొత్త కోణాన్ని చూపించబోతున్నట్టు దర్శకుడు జీతూ జోసెఫ్ తెలిపారు. “గత రెండు భాగాల్లో జార్జ్ కుట్టికి తన వెనుక ఎవరున్నారో తెలుసు. కానీ ఈసారి తనను ఎవరు వెంబడిస్తున్నారో, శత్రువు ఎవరో తెలియని భయంలో అతను ఉంటాడు. ఇదే ఈ సినిమాను ప్రత్యేకంగా నిలబెడుతుంది” అని జీతూ జోసెఫ్ వివరించారు. ఈ తెలియని భయమే ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచుతోంది. ఇటీవల కొచ్చిలో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మోహన్‌లాల్ సరదాగా మాట్లాడుతూ.. “జార్జ్‌కుట్టిని కాపాడమని నేను చాలాసార్లు అడిగాను, కానీ అతను ఇంకా సేఫ్ కాలేదు. కాబట్టి మీరు దృశ్యం 4 కూడా ఆశించవచ్చు” అని వ్యాఖ్యానించి, సీక్వెల్స్‌పై ఆసక్తిని పెంచారు. ఈ చిత్రంలో మీనా, అన్సిబా హసన్, ఎస్తేర్ అనిల్, సిద్దిఖ్, ఆశా శరత్ వంటి వారు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఆశీర్వాద్ సినిమాస్ పతాకంపై ఆంటోనీ పెరుంబవూర్ నిర్మించిన ఈ చిత్రం రన్ టైమ్ 2 గంటల 39 నిమిషాలుగా ఉంది. సినిమాకు సెన్సార్ బోర్డు ఖ/ూ సర్టిఫికెట్ జారీ చేసింది. మే 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




# 'భోగి'లో డింపుల్ హయాతి లుక్ విడుదల



చార్మింగ్ స్టార్ శర్వానంద్, మాస్ మేవరిక్ సంపత్ నంది కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటోన్న భారీ పాన్-ఇండియా పీరియడ్ యాక్షన్ చిత్రం 'భోగి' శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మాణంలో, లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. శర్వా కెరీర్‌లోనే అత్యంత భారీ స్థాయి వెంచర్‌లలో ఒకటిగా తెరకెక్కుతోన్న ఈ మూవీ నుంచి వస్తోన్న ఒక్కో అప్డేట్.. సినిమాపై భారీగా అంచనాలను పెంచేస్తున్నాయి. తాజాగా ఈ మూవీ నుంచి డింపుల్ హయాతి పాత్ర లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ లుక్ ప్రస్తుతం వైరల్ అవడమే కాకుండా, సినిమా గురించి మాట్లాడుకునేలా చేస్తోంది. డింపుల్ హయాతి ఈ చిత్రంలో 'మందారం' అనే పాత్రలో కనిపించనుందని తెలుపుతూ వదిలిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో.. ఆమె ఎర్ర చీరలో బోల్డ్ అండ్ స్టన్నింగ్ లుక్‌లో కనిపిస్తున్నారు. చేతిలో విసనకర్ర పట్టుకుని, ఇంటెన్స్ హావభావాలతో కనిపిస్తున్న ఆమె లుక్.. 1960ల కాలాన్ని ప్రతిబింబించేలా ఉంది. పోస్టర్‌లో కనిపించిన వింటేజ్ బ్రాస్ బాక్స్, గ్రామీణ వాతావరణం ఆమె పాత్రకు మరింత బలాన్ని చేకూర్చుతున్నాయి. ఆమె చూపుల్లోనే ఒక తిరుగుబాటు స్వభావం కనిపిస్తోంది. ఈ లుక్‌ను సోషల్ మీడియాలో విడుదల చేసిన మేకర్స్.. “ప్రపంచం కోరుకున్న సౌందర్యం.. ప్రపంచం ఎన్న డూ అర్థం చేసుకోని ఆత్మ, నిర్భయమైన సంకల్పంతో ముందుకు సాగే శక్తి అయిన 'మందారం'ను పరిచయం చేస్తున్నాం” అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ప్రపంచం గురించి ఏమాత్రం పట్టించుకోని ధైర్యవంతమైన పాత్రలో ఆమె ఇందులో కనిపించనుందని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ పోస్టర్ వైరల్ అవుతోంది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**